శ్రీ క్రోధి నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, మాఘమాసం, బహుళపక్షం పంచమి: రా. 2-28 తదుపరి షష్ఠి చిత్త: తె. 5-35 తదుపరి స్వాతి వర్జ్యం: ఉ. 11-52 నుంచి 1-39 వరకు అమృత ఘడియలు: రా. 10-29 నుంచి 12-15 వరకు దుర్ముహూర్తం: మ. 12-36 నుంచి 1-22 వరకు తిరిగి 2-53 నుంచి 3-39 వరకు రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు సూర్యోదయం: ఉ.6.30; సూర్యాస్తమయం: సా.5.57

తెలుగు దినపత్రిక https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

మేడ్చల్ - మల్కాజిగిరి | సోమవారం | 17-02-2025 | సంపుటి-02 | సంచిక-293 | పేజీలు - 08 | వెల:3/–


### ఓఆర్ఆర్‌ను కేసీఆర్ అమ్ముకున్నారు

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపణ**

**నల్గొండ:** ఎన్నికల ముందు మాజీ సీఎం కేసీఆర్ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)ను కమీషన్ కోసం అమ్ముకున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. రూ.30 వేల కోట్లతో రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) పనులను ప్రారంభించడంలో గత కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ఆదివారం నల్గొండలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ''హైదరాబాద్ చుట్టూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మిస్తున్న ఆర్ఆర్ఆర్‌తో రాష్ట్ర ప్రగతి మరో మెట్టు ఎక్కుతుంది. ఎస్సెల్బీసీ టన్నెల్ తవ్వే యంత్రాలను అమెరికా నుంచి తెప్పిస్తాం'' అని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

## మూడేళ్లలో 30 వేల మందికి ఉద్యోగాలు

### ఏటా 10 వేల మంది బీటెక్, డిగ్రీ పట్టభద్రులకు బీఎఫ్ఎస్ఐ శిక్షణ
### మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి



**హైదరాబాద్,(అక్షరగళం):** 'బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ)' శిక్షణ కోర్సు ద్వారా వచ్చే మూడేళ్లలో రాష్ట్రంలోని బీటెక్, డిగ్రీ పట్టభద్రుల్లో 30 వేల మందికి ఉద్యోగాలు కల్పించనున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. 'బీఎఫ్ఎస్ఐస్కిల్లింగ్' కోర్సులో శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆదివారం అర్హత పరీక్ష నిర్వహించిన నేపథ్యంలో.. దీని ప్రాధాన్యం పేర్కొంటూ మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. ''అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు (మిగతా 2 లో)

## రాజీవ్, రాహుల్‌గాంధీలు హిందువులే కాదు

### పట్టభద్రుల సమస్యలపై కాంగ్రెస్ ఏనాడైనా పోరాడిందా? : బండి సంజయ్



**కరీంనగర్,(అక్షరగళం):** పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్‌కు అర్హత లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో నిర్వహించిన కరీంనగర్ఆదిలాబాద్‌నిజామాబాద్‌మెదక్ ఎమ్మెల్సీ నియోజకవర్గ సామాజిక మాధ్యమ కార్యకర్తల సమావేశంలో, స్వదేశీ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన స్వదేశీ మేళా ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ''తండ్రి కులమే కొడుక్కి వర్తిస్తుందని, రాజీవ్‌గాంధీ హిందువే కాబట్టి ఆయన కుమారుడు రాహుల్‌గాంధీ హిందువేనని కాంగ్రెస్ నేతలు మాట్లాడటం విడ్డూరంగా ఉంది. రాజీవ్‌గాంధీ తండ్రి ఫిరోజ్ జహంగీర్ పార్శీ. అలాంటప్పుడు రాజీవ్‌గాంధీ, ఆయన కుమారుడు రాహుల్ హిందువులు ఎలా అవుతారు? బీసీ కులగణన పేరుతో హిందువులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెబుతున్నా.. అందులో 10 శాతం ముస్లింలకే వెళ్తాయి. ముస్లింలను బీసీ జాబితాలో చేర్చి కేంద్రానికి పంపితే దాన్ని ఆమోదించే ప్రసక్తే లేదు. జాబితాలో ముస్లిం జనాభాను తొలగించి పంపిస్తే ఆమోదం పొందేలా చేస్తాం. మహారాష్ట్ర ప్రభుత్వం మాదిరిగా మత మార్పిళ్లు, లవ్ జిహాదీలపై తెలంగాణలోనూ చట్టం తీసుకురావాలి. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉపాధ్యాయుల, పట్టభద్రుల పక్షాన ఏనాడైనా పోరాటాలు చేశారా?'' అని బండి సంజయ్ ప్రశ్నించారు.

## కృష్ణా బోర్డు ఛైర్మన్‌కు మంత్రి ఉత్తమ్ ఫోన్

### కృష్ణా జలాలను ఏపీ విడుదల చేసుకోవడంపై చర్యలు చేపట్టాలని సూచన
### సీడబ్ల్యూసీ, బోర్డులకు లేఖలు రాయాలని ముఖ్య కార్యదర్శికి ఆదేశాలు



**హైదరాబాద్,(అక్షరగళం):** కృష్ణా జలాలను ఏపీ తరలిస్తుండటాన్ని వెంటనే నిలువరించాలంటూ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఛైర్మన్ అతుల్ జైన్‌ను కోరారు. ఛైర్మన్‌కు ఫోన్ చేసిన మంత్రి.. కృష్ణా జలాల విషయంలో పలు అంశాలను ప్రస్తావించినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. శ్రీశైలం, సాగర్‌ల నుంచి ఏపీ వాటాకు మించి తరలిస్తుండటంపై ఈఎన్సీ పలుమార్లు బోర్డుకు లేఖలు రాయడం, స్వయంగా కలిసి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఈ అంశంపై ఆదివారం హైదరాబాద్‌లోని జలసౌధలో నిర్వహించిన ఒక సమీక్ష సందర్భంగా మంత్రి బోర్డు ఛైర్మన్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. నాగార్జునసాగర్ నుంచి కుడి కాలువ ద్వారా నిరంతరం ఏపీ నీటిని విడుదల చేసుకుంటోందని దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. శ్రీశైలం, సాగర్‌లలో నీటి మట్టాలు పడిపోతున్న నేపథ్యంలో తాగునీటి అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ కోరిన మేరకు నీటి కేటాయింపులు చేయాలన్నారు. నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు ఫోన్ చేసి ఈ అంశంపై కేంద్ర జల సంఘానికి (సీడబ్ల్యూసీ), కృష్ణా బోర్డుకు వెంటనే లేఖలు రాయాలని మంత్రి ఆదేశించినట్లు తెలిసింది. అనంతరం అధికారులు, ఇంజినీర్లతో నిర్వహించిన సమీక్షలో.. రాష్ట్ర ప్రభుత్వం నీటిపారుదల రంగంలో చేపడుతున్న అభివృద్ధి, సాంకేతిక విధానాలపై ఒక పవర్‌పాయింట్ ప్రజంటేషన్ రూపొందించాలని మంత్రి సూచించారు. సమావేశంలో శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ ఇతర ఇంజినీర్లు పాల్గొన్నారు.

## ఏపీ గదులు దాటి వెళ్లట్లేదు

### ఏసీ గదులు దాటి వెళ్లట్లేదు
### క్షేత్రస్థాయిలో పనిచేయాలంటున్నా కొందరు అధికారులు వినట్లేదు
### అసంతృప్తిగా ఉంది.. వారి తీరు మారాలి
### నిబద్ధతతోనే గుర్తింపు వస్తుంది: సీఎం రేవంత్‌రెడ్డి
### విశ్రాంత ఐఏఎస్ గోపాలక్రిష్ణనాయుడి స్వీయచరిత్ర పుస్తకావిష్కరణ



**హైదరాబాద్,(అక్షరగళం):** ''నాయకులు వస్తుంటారు.. పోతుంటారు. ఏళ్ల పాటు సేవలందించే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ.. జనం ప్రయోజనాల కోసం ఆలోచనలు చేయాల్సిన అవసరం ఉంది'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. నోట్‌ఫైల్ సిద్ధం చేయడానికే పరిమితం కాకుండా రాజకీయ నాయకుల ప్రతి ఆలోచన, ప్రకటనలో మంచి చెడులను విశ్లేషించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. 'లైఫ్ ఆఫ్ ఎ కర్మయోగి మెమోయిర్ ఆఫ్ ఎ సివిల్ సర్వెంట్' పేరిట విశ్రాంత ఐఏఎస్ గోపాలక్రిష్ణనాయుడు రచించిన స్వీయచరిత్ర పుస్తకాన్ని (మిగతా 2 లో)



## నేడు కేసీఆర్ జన్మదినం సందర్భంగా భారీగా వేడుకలు

2

### తెలంగాణ భవన్‌లో ఏర్పాట్లు పరిశీలించిన తలసాని

## తెలంగాణ నీటి ప్రయోజనాలు కాంగ్రెస్‌కు పట్టవా?

### మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శ



**హైదరాబాద్,(అక్షరగళం):** తెలంగాణ నీటి ప్రయోజనాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గండి కొడుతుంటే రాష్ట్ర సర్కారు చోద్యం చూస్తుండడం దుర్మార్గమని.. రాష్ట్ర నీటి ప్రయోజనాలు కాంగ్రెస్‌కు పట్టవా? అని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ఒక ప్రకటనలో విమర్శించారు. ''కృష్ణా జలాలను ఏపీ అడ్డూ అదుపూ లేకుండా తరలించుకుపోతుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, (మిగతా 2 లో)

## అప్పులపై మాట్లాడే నైతిక హక్కు మీకెక్కడిది?

### కేంద్ర ఆర్థిక మంత్రిపై కేటీఆర్ మండిపాటు



**హైదరాబాద్,(అక్షరగళం):** స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 14 మంది ప్రధాన మంత్రులు 65 ఏళ్లలో రూ.56 లక్షల కోట్ల అప్పులు చేస్తే.. 2014 నుంచి 2024 వరకు పదేళ్లలోనే కేంద్రంలోని భాజపా ప్రభుత్వం రూ.125 లక్షల కోట్ల అప్పు చేసిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఇంత భారీగా అప్పులు చేసిన కేంద్రంలోని భాజపా ప్రభుత్వానికి అప్పులపై మాట్లాడే నైతిక హక్కు లేదని ఆయన మండిపడ్డారు. ఆంధ్రాలో విలీనం చేసినప్పుడు కూడా తెలంగాణ మిగులు బడ్జెట్ (మిగతా 2 లో)



## 'మూసీ'కి ముంచుకొస్తున్న ముప్పు

### జలాశయంలో 15.32 శాతం మేర పూడిక
### 4.46 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంలో 0.74 టీఎంసీల తగ్గుదల
### పరిరక్షణ చర్యలు సూచించిన సీడబ్ల్యూసీ

**హైదరాబాద్,(అక్షరగళం):** మూసీ జలాశయానికి పూడిక ముప్పు ముంచుకొస్తోంది. సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలో మూసీ నదిపై నిర్మించిన ఈ జలాశయంలో నీటి నిల్వ సామర్థ్యం ఏటికేడు పడిపోతూ వస్తోంది. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) గతేడాది హైడ్రోగ్రాఫిక్, రిమోట్ సెన్సింగ్ సాంకేతికతతో సర్వే చేపట్టింది. దేశవ్యాప్తంగా 87 జలాశయాలు పూడిక కారణంగా వేగంగా నీటి నిల్వ సామర్థ్యాన్ని కోల్పోతుండగా.. వాటిలో తెలంగాణలోని రెండు జలాశయాలు ఉన్నట్లు సర్వేలో తేలిందని సీడబ్ల్యూసీ తన నివేదికలో పేర్కొంది. వాటిలో ఉస్మాన్‌సాగర్ ఒకటి కాగా.. మరొకటి మూసీ జలాశయం. మూసీ జలాశయంలో 15.32 శాతం మేర సెడిమెంటేషన్(పూడిక) ఉందని, పరిరక్షణ చర్యలు తప్పనిసరి అని స్పష్టం చేసింది. (మిగతా 2 లో)



## పీఎఫ్ ఖాతాలు బోగస్ కంపెనీలకు అనుసంధానం!

### డబ్బు లాగేందుకు సైబర్ నేరగాళ్ల పన్నాగం
### ఉద్యోగులకు 'మూన్‌లైటింగ్' ముప్పు
### సొంతంగానే తొలగించుకునేలా ఈపీఎఫ్‌వో 'డీలింక్' ఆప్షన్

**హైదరాబాద్,(అక్షరగళం):** రాజధాని హైదరాబాద్‌కు చెందిన ఓ ఉద్యోగికి సైబర్ నేరగాళ్లు డబ్బు కోసం బెదిరిస్తూ కాల్ చేశారు. ఇవ్వనని చెప్పడంతో ఆయన పీఎఫ్ ఖాతా(యూఏఎన్)ను వారు బోగస్ కంపెనీకి అనుసంధానం చేశారు. ఆ విషయం తెలియని ఉద్యోగి మరో కంపెనీలో ఇంటర్వ్యూకు వెళ్లగా.. (మిగతా 2 లో)



## యువజన కాంగ్రెస్‌తోనే పార్టీకి బలం

### సీఎంనైనా ప్రశ్నించే హక్కు కాంగ్రెస్‌లో ఉంటుంది
### ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి
### పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

**మహేశ్వరం,(అక్షరగళం):** యువజన కాంగ్రెస్ కార్యకర్తలే పార్టీకి బలమని.. వారు జెండాలు మోసి పోరాటం చేయడంతోనే అధికారంలోకి వచ్చామని పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో యువత చురుగ్గా పాల్గొనడం ద్వారా దేశవ్యాప్తంగా యూత్ కాంగ్రెస్‌కు మంచి పేరు ఉందని తెలిపారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం ఘట్టుపల్లిలోని ఓ రిసార్ట్‌లో తెలంగాణ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించే (మిగతా 2 లో)

## తెలంగాణ నీటి ప్రయోజనాలు కాంగ్రెస్‌కు పట్టవా?



(మొదటి పేజీ తరువాయి)
నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఏం చేస్తున్నారు? మూడు నెలలుగా నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి రోజుకు 10వేల క్యూసెక్కులను ఏపీ తరలించుకుపోతుంటే ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది? ఈ నీటి సంవత్సరంలోనే 646 టీఎంసీలు తరలిస్తే ఎందుకు నోరు మెదపడం లేదు? తెలంగాణ తాగునీటి అవసరాలకు శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో నిలువ ఉంచాల్సిన కోటాను ఏపీ తీసుకెళ్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదు. ఏటా ఉమ్మడి ప్రాజెక్టులకు సంబంధించి నీటి వినియోగంపై కేఆర్‌ఎంబీ పరిధిలోని త్రీమెన్ కమిటీ సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది. కానీ ఈ ఏడాది ఇంతవరకు త్రీమెన్ కమిటీ మీటింగ్ పెట్టలేదంటే.. బోర్డు వ్యవహారం ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. బోర్డుపై ఒత్తిడి చేయడంలో, నీరు తరలించకుండా ఏపీని నిలువరించడంలో.. తద్వారా తెలంగాణ నీటి హక్కులను కాపాడటంలో కాంగ్రెస్ సర్కారు ఘోరంగా విఫలమైంది. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నాగార్జునసాగర్, శ్రీశైలం రిజర్వాయర్లు ఖాళీ అయిన పరిస్థితి. మరోవైపు వేసవి మొదలు కాకుండానే.. తెలంగాణ రైతులు నీళ్ల కోసం రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి.. ఏపీ నీటి దోపిడీని అడ్డుకోవాలి. ఈ మేరకు కృష్ణా బోర్డుపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేస్తున్నాం'' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## యువజన కాంగ్రెస్‌తోనే పార్టీకి బలం

(మొదటి పేజీ తరువాయి)
మూడు రోజుల శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాజీవ్‌గాంధీ మాదిరిగానే రాహుల్‌గాంధీ కూడా యువజన కాంగ్రెస్ కార్యకర్తలను ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని, కాంగ్రెస్ ప్రభుత్వానికి రక్షణ కవచంలా పనిచేయాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియాపై దృష్టి పెట్టాలని, ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. క్రమశిక్షణ గల కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీలో ఉన్నత పదవులు దక్కుతాయనేందుకు తానే ఉదాహరణ అని అన్నారు.




కాంగ్రెస్‌లో ప్రతి కార్యకర్తకు స్వేచ్ఛ ఉంటుందని, రాష్ట్ర ముఖ్యమంత్రిని సైతం ప్రశ్నించే హక్కు ఉంటుందన్నారు. అంతకుముందు జాతీయ జెండాను మహేశ్‌కుమార్‌గౌడ్ ఆవిష్కరించి శ్రేణులతో కలిసి జాతీయగీతం ఆలపించారు. మహేశ్‌కుమార్‌గౌడ్‌ను నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి, యువజన కాంగ్రెస్ జాతీయ ట్రైనింగ్ ఇన్‌ఛార్జి సీతారామ్ లాంబా, కోట్రైనర్ పీవీ చౌహాన్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఇన్‌ఛార్జులు సురభి, ఖలీద్ తదితరులు పాల్గొన్నారు.

**తొక్కిసలాట దురదృష్టకరం..**

ఈనాడు, హైదరాబాద్: న్యూదిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట జరిగి 18 మంది మరణించడం దురదృష్టకరమని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ఆదివారం ఒక ప్రకటనలో ఆయన సంతాపం తెలిపారు. బాధిత కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## ఏసీ గదులు దాటి వెళ్లట్లేదు



(మొదటి పేజీ తరువాయి)
ఆదివారం బేగంపేటలోని ఐఏఎస్ అధికారుల ఇన్‌స్టిట్యూట్‌లో ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ''గతంలో అధికారులు ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంతో శ్రమించేవారు. ప్రజలు అంతే గొప్పగా వారి గురించి మాట్లాడుకునేవారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆదేశిస్తున్నా కొందరు అధికారులు వినని పరిస్థితి. వారు ఏసీ గదులను విడిచి వెళ్లడం లేదు. ఈ విషయంలో నేను అసంతృప్తిగా ఉన్నా. అధికారుల ఆలోచన విధానంలో మార్పులు రావాలి. నిబద్ధతతో పనిచేసే వారికి గుర్తింపు తప్పనిసరిగా ఉంటుంది. మంత్రుల విద్యార్హతలు, నేపథ్యానికి.. వారికి కేటాయించే శాఖలకు సంబంధం ఉండకపోవచ్చు. అలాంటి సందర్భాల్లో అధికారులే చొరవ తీసుకొని తప్పొప్పులను విశ్లేషించి హెచ్చరించాలి'' అని సీఎం పేర్కొన్నారు.

**అలాంటి అధికారులే ఆదర్శం**

''తన అనుభవ సారాన్ని పుస్తక రూపంలో తీసుకురావడంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి గోపాలక్రిష్ణనాయుడు విజయవంతమయ్యారు. ఉద్యోగ జీవితంలో 1962లో ప్రవేశించిన ఆయన నెహ్రూ నుంచి నరేంద్రమోదీ వరకు దేశ ఆర్థిక పరిణామాలకు ప్రత్యక్ష సాక్షి. ఈ పుస్తకం చదవడం ద్వారా ఉన్నత సేవలు అందించేలా ఉద్యోగులకు ప్రేరణ కలుగుతుంది. నిబద్ధత కలిగిన శంకరన్, ఎంతటి రాజకీయ నాయకుడైనా ఒక చట్రంలో పనిచేసేలా ఎన్నికల సంస్కరణల్లో కీలకపాత్ర పోషించిన టి.ఎన్.శేషన్, దేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చిన మాజీ ప్రధాని డా.మన్మోహన్ సింగ్ వంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలి'' అని రేవంత్‌రెడ్డి ఉద్యోగులకు సూచించారు. విశ్రాంత ఐఏఎస్ అధికారులతో యువ ఐఏఎస్‌లకు శిక్షణ తరగతులు నిర్వహించాలని సీఎస్ శాంతికుమారిని సీఎం ఆదేశించారు.

**ఎన్టీఆర్ పెట్టిన పేరు 'గోదావరి గోపాలక్రిష్ణ'**

సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ.. గోపాలక్రిష్ణనాయుడికి దాదాపు 400 అవార్డులు వచ్చాయని చెప్పారు. ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ.. చైనాతో యుద్ధం తర్వాత క్లిష్టమైన పరిస్థితుల మధ్య యువ ఐఏఎస్ అధికారిగా గోపాలక్రిష్ణనాయుడు అస్సాంలో సేవలందించారని, పదవీ విరమణ తర్వాత సైతం ఆదర్శంగా ఉన్నారని కొనియాడారు. రచయిత, గోపాలక్రిష్ణనాయుడు స్పందిస్తూ.. ''నేను వాణిజ్యపన్నులశాఖ అధికారిగా ఉన్నప్పుడు ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పిలిచి గోదావరి ఫెర్టిలైజర్స్ పెడుతున్నామని, ఆ బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుందని చెప్పారు. అక్కడ ప్రారంభోత్సవంలో గోదావరి గోపాలక్రిష్ణ అని నాకు ఎన్టీఆర్ నామకరణం చేశారు. ప్రజలూ అదే పేరుతో పిలిచేవారు. త్వరలో మేనేజ్‌మెంట్ తంత్రాస్ పేరుతో మరో పుస్తకం తీసుకొస్తా. మా గ్రామం కొడగల్ కోసం గూగుల్‌లో సెర్చ్ చేసిన ప్రతిసారీ కొడంగల్ అని వస్తోంది. అందుకు కారణం సీఎం రేవంత్‌రెడ్డి'' అంటూ చమత్కరించారు. కార్యక్రమంలో గోపాలక్రిష్ణనాయుడు భార్య సుజాత, విశ్రాంత ఐఏఎస్ అధికారులు పాల్గొన్నారు. గతంలో ప్రజాప్రతినిధులు ఏదైనా ప్రస్తావిస్తే.. అధికారులు అందులోని లోటుపాట్లను విశ్లేషించేవారు. కానీ ఇప్పుడేమో.. ఒక తప్పు చేద్దామంటే మూడు చేద్దామనే అధికారులను చూస్తున్నాం. కొత్తగా ఎంపికైన ఐపీఎస్‌లలో కొందరు శిక్షణలో ఉన్నప్పుడే యూనిఫామ్ వేసుకొని మరీ ప్రైవేటు పంచాయితీలు చేస్తున్నారు. ఈ ధోరణులు సమాజానికి మంచిది కాదు. కొంతమందిలోనైనా మార్పు రావాలని ఈ వేదికపై ఈ విషయం చెబుతున్నా''



## నేడు కేసీఆర్ జన్మదినం సందర్భంగా భారీగా వేడుకలు

**హైదరాబాద్:** భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 71వ జన్మదినం సందర్భంగా సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా భారీ వేడుకలు నిర్వహించేందుకు పార్టీ నాయకులు ఏర్పాట్లు చేశారు. అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో కేసీఆర్ జన్మదిన వేడుకలను ఎక్కడికక్కడ ఘనంగా జరుపుకోవడానికి పార్టీ శ్రేణులు సన్నద్ధమయ్యాయి. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆదివారం తలసాని పరిశీలించారు. కేసీఆర్ నిలువెత్తు చిత్రపటాలు, ఫ్లెక్సీలు, గులాబీ తోరణాలతో తెలంగాణ భవన్‌ను అలంకరించారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ కాలం నుంచి పదేళ్లపాటు ముఖ్యమంత్రిగా కేసీఆర్ అందించిన సేవలను ప్రతిబింబించేలా చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నారు. ''డప్పు కళాకారులు, గిరిజన వేషధారణ నృత్యాల ప్రదర్శన, కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, కేసీఆర్ జీవిత, రాజకీయ ప్రస్థానంతో కూడిన ప్రత్యేక డాక్యుమెంటరీ ప్రదర్శన ఉంటుంది. 71వ జన్మదిన సందర్భంగా 71 కిలోల భారీ కేక్‌ను కట్ చేస్తారు. వేడుకలకు పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీమంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవిత, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అభిమానులు, ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటడం, పండ్ల పంపిణీ, అన్నదానం, ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించనున్నాం'' అని తలసాని పేర్కొన్నారు.

## 'మూసీ'కి ముంచుకొస్తున్న ముప్పు



(మొదటి పేజీ తరువాయి)
**0.74 టీఎంసీలు తగ్గుదల**

మూసీ జలాశయాన్ని 1962లో 42 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు 4.83 టీఎంసీల స్థాపిత సామర్థ్యంతో నిర్మించారు. జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా.. నిర్మించినప్పటి నుంచి 2024 వరకు 0.74 టీఎంసీల (15.32 శాతం) మేరకు పూడిక చేరింది. ఫలితంగా నీటి నిల్వ సామర్థ్యం 3.72 టీఎంసీలకు, ఆయకట్టు 33 వేల ఎకరాలకు పడిపోయింది. మూసీ నదికి వరదలు వచ్చినప్పుడు, ఉప నదులు, వాగుల ప్రవాహంతో ఇసుక, మట్టి జలాశయంలోకి చేరి పేరుకుపోతున్నాయి. నది ఒడ్డున ఉన్న నగరాలు, పట్టణాల నుంచి వినియోగించిన జలాలు, మురుగు వచ్చి చేరుతున్నాయి. నది ఒడ్డు కోతకు గురికావడం కూడా ఒక కారణం. 2084 నాటికి జలాశయం సామర్థ్యం ఒక టీఎంసీ మేర తగ్గిపోతుందని సీడబ్ల్యూసీ తెలిపింది. వరదల సమయంలో దిగువ భాగంలో ఉండే తూములు తెరవడం, వరద గేట్ల నిర్వహణ సక్రమంగా చేపట్టడం ద్వారా పూడిక ముప్పును కొంతవరకు తప్పించవచ్చని.. మూసీ ఎగువ పరీవాహకంలో తీరప్రాంతం కోతకు గురికాకుండా చర్యలు చేపట్టాలని సూచించింది. ప్రతి ఐదేళ్లకు ఒకసారి హైడ్రోగ్రాఫిక్ సర్వే చేపట్టడం ద్వారా పూడిక శాతాన్ని పక్కాగా లెక్కగట్టి ప్రమాద తీవ్రతను అంచనా వేయొచ్చని కేంద్ర జల సంఘం వివరించింది.



మహబూబ్ నగర్ జిల్లా మారేడుపల్లి కి చెందిన ప్రమీల అనే మహిళ అనారోగ్యంతో ఉస్మానియా ఆసుపత్రికి వెళ్తే ఆమెకు ఆధార్ కార్డు లేదని వైద్యం చేయడానికి నిరాకరించిన ఘటనపై పత్రికలో వచ్చిన వార్త కథనంపై ఉస్మానియా ఆస్పత్రి వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ. అనారోగ్యంతో బాధపడుతున్న ప్రమీలకు వెంటనే మెరుగైన వైద్యాన్ని అందించాల్సిందిగా ఉస్మానియా ఆసుపత్రి సూపరింటేండెంట్ ను మంత్రి ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు ప్రమీలకు మెరుగైన వైద్యాన్ని ఉదయం నుంచి అందించడం జరుగుతుంది. ప్రమీల ఆరోగ్యం క్రమంగా మెరుగైందని ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు మంత్రి దామోదర్ రాజనర్సింహ గారికి తెలియజేశారు.



## పీఎఫ్ ఖాతాలు బోగస్ కంపెనీలకు అనుసంధానం!

(మొదటి పేజీ తరువాయి)
ఒకే సమయంలో రెండు కంపెనీల్లో పనిచేసినట్లు (మూన్‌లైటింగ్) సర్వీసు హిస్టరీలో కనిపించింది. దీంతో ఆయన ఉద్యోగావకాశం కోల్పోయారు. ఇలాంటి ఖాతాలను తొలగించాలంటే ఈపీఎఫ్‌వోకు పరిపాలన, సాంకేతిక అడ్డంకులు ఎదురయ్యేవి. ఇప్పుడు దీనికి పరిష్కారం లభించింది. ఉద్యోగులే సొంతంగా బోగస్ కంపెనీ వివరాలు తొలగించుకునేందుకు వీలుకల్పిస్తూ.. 'డీలింక్' ఆప్షన్ అందుబాటులోకి తెచ్చింది. ఈపీఎఫ్‌వో నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి ఏకకాలంలో రెండు సంస్థల్లో పనిచేయకూడదు. దీన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరస్థులు.. ఉద్యోగులను డబ్బు డిమాండ్ చేస్తున్నారు. ఇవ్వని ఉద్యోగుల పీఎఫ్ ఖాతాలను ఒడిశా, యూపీ, రాజస్థాన్, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో నమోదైన బోగస్ కంపెనీల్లో పనిచేస్తున్నట్లు లింకు చేశారు. ఇలాంటి మోసాలపై ఇటీవల ఈపీఎఫ్‌కు, పోలీసులకు ఫిర్యాదులు పెరిగాయి. పీఎఫ్ ఖాతాకు అనుసంధానమైన బోగస్ కంపెనీల వివరాలు తొలగించాలంటే ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో విచారించి నిర్ణయం తీసుకోవాల్సి వచ్చేది. ఈపీఎఫ్‌వో ఇప్పుడు ఈ పద్ధతిని మార్చింది. చందాదారులకు తెలియకుండా పీఎఫ్ ఖాతాకు అనుసంధానమైన బోగస్ కంపెనీల వివరాలను వారే వ్యక్తిగతంగా తొలగించుకునే ఆప్షన్‌ను అమలులోకి తెచ్చింది.

**డీలింక్ ఎలా చేయాలంటే...**

చందాదారులు ఈపీఎఫ్ మెంబర్ పోర్టల్‌లో యూఏఎన్ నంబరు, పాస్‌వర్డ్ నమోదు చేసి లాగిన్ కావాలి.

తరువాత హోంపేజీలోని 'వ్యూ' ఆప్షన్‌లో ఉండే 'సర్వీస్ హిస్టరీ' మెనూ ఎంచుకోవాలి.

ఈ సర్వీసు హిస్టరీలో తెలియకుండా పీఎఫ్ ఖాతా లింకు అయిన కంపెనీ వివరాలతో పాటు ఆ పక్కనే 'డీలింక్' ఆప్షన్ ఉంటుంది.

డీలింక్‌ను ఎంపిక చేసుకున్న తరువాత ఆధార్ అనుసంధాన మొబైల్ నంబరుకు ఓటీపీ వస్తుంది. ఈ ఓటీపీని నమోదు చేస్తే డీలింక్ ప్రక్రియ పూర్తవుతుంది. తర్వాత సర్వీసు హిస్టరీలో చూస్తే డీలింక్ అయిన కంపెనీ వివరాలు కనిపించవు.

ఒకవేళ ఉద్యోగి నిజంగానే రెండు కంపెనీల్లో పనిచేస్తే (మూన్‌లైటింగ్).. రెండు సంస్థలూ ఈపీఎఫ్ చందా చెల్లించినట్లు రికార్డుల్లో నమోదైతే డీలింక్ చేయాలనుకున్నా వీలుకాదు. 'ఎర్రర్' అని వస్తుంది. ఆ ఖాతా వివరాలు డీలింక్ కావు.

ఆధార్ అనుసంధాన మొబైల్ నంబరు మనుగడలో ఉండాలని, డీలింక్ చేయబోయే సంస్థ విషయంలో పొరపాట్లు జరగకుండా సరిచూసుకోవాలని ఈపీఎఫ్‌వో స్పష్టం చేసింది.



## అప్పులపై మాట్లాడే నైతిక హక్కు మీకెక్కడిది?

ఉన్న రాష్ట్రమేనని స్పష్టం చేశారు. 2014లో తెలంగాణ ఏర్పడిన సమయంలోనూ దాదాపు రూ.70 వేల కోట్ల అప్పు ఉందని పేర్కొన్నారు. భారాస పదేళ్ల పాలన తర్వాత కూడా మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రంగానే కాంగ్రెస్‌కు అప్పజెప్పినట్లు తెలిపారు. అప్పులను, మిగులు బడ్జెట్‌తో ముడిపెట్టడం సమంజసం కాదన్నారు. తెలంగాణ అప్పులపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల పార్లమెంటులో చేసిన వ్యాఖ్యలపై స్పందించిన కేటీఆర్.. ఆదివారం ఆమెకు బహిరంగ లేఖ రాశారు. ''అప్పులున్నంత మాత్రాన ఒక రాష్ట్రం వెనకబడినట్టుగా చిత్రీకరించే ప్రయత్నం సరికాదు. అప్పులను దేనికోసం ఖర్చు పెట్టారనేదే కీలకం. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం పదేళ్లలో తెచ్చిన రూ.125 లక్షల కోట్ల అప్పులతో ఏం చేసిందో చెప్పే పరిస్థితి లేదు. రాష్ట్రంలో గత భారాస ప్రభుత్వం అప్పుగా తెచ్చిన ప్రతి పైసాను పెట్టుబడిగా మార్చి.. తెలంగాణ నేలపై తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులను దేశమంతా చూసింది. సమైక్య రాష్ట్రంలో విధ్వంసానికి గురైన తెలంగాణ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చి.. దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దింది. వ్యవసాయంతోపాటు పారిశ్రామిక రంగాన్ని వెంటాడిన చిమ్మచీకట్లను పారదోలేందుకు భారీ విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు ఉపయోగించాం. కేంద్ర ప్రభుత్వ ఖజానా నింపే స్థాయికి తెలంగాణను తీర్చిదిద్దినందుకు మీరిచ్చే బహుమానం అవమానాలేనా?'' అని కేటీఆర్ ప్రశ్నించారు.

## తెలంగాణకు బీజేపీ కొత్త అధ్యక్షుడు

**వరంగల్:** తెలంగాణ రాజకీయాల్లో రోజుకో కీలక పరిణామం చోటుచేసుకుంటోంది. ఇటీవల రాష్ట్రంలో నడుస్తోన్న రాజకీయాలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. అధికార ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జోరుగా నడుస్తుండగా.. కులగణన చేసి బీసీలకు న్యాయం చేస్తున్నామంటూ కాంగ్రెస్ పార్టీ చెప్తుంటే, తప్పుల తడకతో జనాలను మోసం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ ఆరోపిస్తూ.. ప్రజల్లోకి దూసుకుపోతున్నారు. ఈ నేపథ్యంలోనే.. బీజేపీ పార్టీ కూడా తమ గళాన్ని గట్టిగా వినిపిస్తూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు గట్టిగానే ప్రయత్నిస్తోంది. ఇటీవల.. ప్రధాని మోదీ కులానికి సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తమదైన శైలిలో ఖండిస్తూ.. కమలదళం అందరి దృష్టిని తమవైపు తిప్పుకుంటోంది. ఈ క్రమంలోనే.. తెలంగాణ బీజేపీకి కొత్త అధ్యక్షుడి నియామకం గురించి కీలక ప్రకటన చేసి మరింత ఆసక్తి పెంచారు.. కేంద్ర మంత్రి, ప్రభుత్వం తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి. ఆదివారం (ఫిబ్రవరి 16న) రోజున వరంగల్‌లో పర్యటించిన కిషన్ రెడ్డి.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణనపై, మోదీపై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఏ ఒక్క బీసీ సంఘం కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సర్వేతో ఏకీభవించట్లేదని కిషన్ రెడ్డి ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లకు బీజేపీ మద్దతునిస్తుందని తెలిపిన కిషన్ రెడ్డి.. రాష్ట్రంలో సర్వే పూర్తయి, బీసీ సంఘాలు సమర్థిస్తే కేంద్రాన్ని ఒప్పించి ఆమోదింపజేస్తామని కీలక ప్రకటన చేశారు. రాహుల్ గాంధీ కులం గురించి సర్వే చేయాల్సిన అవసరం లేదని.. ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశంతోనే సర్వేలు చేయాలని కాంగ్రెస్ నేతలకు కిషన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఈ క్రమంలోనే.. తెలంగాణ బీజేపీ నూతన అధ్యక్షుడి గురించి కిషన్ రెడ్డి కీలక ప్రకటన చేశారు.



తెలంగాణ బీజేపీకి కొత్త అధ్యక్షుడు రాబోతున్నారని కిషన్ రెడ్డి ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే బీజేపీకి నూతన రాష్ట్ర అధ్యక్షుడు వస్తాడని స్పష్టం చేశారు. బిజీ షెడ్యూల్ వల్ల రాష్ట్ర అధ్యక్షుడి నియామకం ఆలస్యమవుతోందని కిషన్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. మరోవైపు.. బీఆర్ఎస్ పార్టీతో కలవాల్సిన అవసరం తమకు లేదని క్లారిటీ ఇచ్చారు కిషన్ రెడ్డి. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అభ్యర్థులను నిలబెట్టేందుకు భయపడుతున్నాయని విమర్శించారు. ఆ రెండు పార్టీల మధ్య అంతర్గత సంబంధం ఉందని కీలక ఆరోపణలు చేశారు. ప్రాజెక్టుల పేరుతో కేసీఆర్ కుటుంబం దోపిడీ చేసిందని రేవంత్ రెడ్డి ఆరోపణలు చేశారని.. ఇప్పుడు ఆయన కూడా అదేబాటలో నడుస్తున్నారని ఆరోపించారు. అందినకాడికి అప్పులు చేసి, రాష్ట్రాన్ని దివాళా తీసే పరిస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. భూములు అమ్మడం, సొమ్ము చేసుకోవడమే లక్ష్యంగా రేవంత్ సర్కార్ పనిచేస్తోందని కిషన్ రెడ్డి మండిపడ్డారు. వనరులు సమకూర్చుకునే అంశంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి స్పష్టమైన ప్రణాళిక లేదని విమర్శించారు కిషన్ రెడ్డి. ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు రోడ్ మ్యాప్ కూడా లేదన్నారు. గుడ్డెద్దు వెళ్లి చేనులో పడ్డట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఉందన్నారు. ఘాటుగానో, ఆవేశంగానో మాట్లాడితే ప్రజలు ఎక్కువ రోజులు భరించరని కిషన్ రెడ్డి తనదైన స్టైల్‌లో కౌంటర్ ఇచ్చారు.

## మూడేళ్లలో 30 వేల మందికి ఉద్యోగాలు

(మొదటి పేజీ తరువాయి)
ఈ ఏడాది జులై వరకు బ్యాంకింగ్ ఆపరేషన్స్, ఫైనాన్షియల్ మార్కెట్స్, ఇన్సూరెన్స్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, సాఫ్ట్‌వేర్, ప్రోగ్రామింగ్, అప్లికేషన్ అండ్ డేటాబేస్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, సాఫ్ట్ స్కిల్స్ తదితర అంశాలపై యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో శిక్షణ ఇస్తారు. అనంతరం బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్(బీఎఫ్ఎస్ఐ)కు సంబంధించిన హైదరాబాద్‌లోని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల(జీసీసీ)లో ప్లేస్‌మెంట్స్ కల్పిస్తారు. దీనిద్వారా ఏటా 10 వేల మంది బీటెక్, డిగ్రీ పట్టభద్రులకు శిక్షణ ఇస్తారు. వీరిలో 5 వేల మంది ఇంజినీరింగ్, మరో 5 వేల మంది డిగ్రీ పట్టభద్రులుంటారు. నిర్వహణ ఖర్చును ఎక్విప్ సంస్థ, బీఎఫ్ఎస్ఐల కన్సార్షియం భరిస్తుంది. విద్యార్థులు స్వల్పమొత్తంలో అడ్మిషన్ ఫీజు చెల్లిస్తే చాలు. సర్టిఫికెట్, ఇతర అడ్మినిస్ట్రేటివ్ అవసరాల కోసం అభ్యర్థుల నుంచి ఒక్కసారి మాత్రమే రూ.5 వేలు వసూలు చేస్తారు. గతేడాది సెప్టెంబరులో మొదటి బ్యాచ్ ప్రారంభమైంది. ఇప్పటికే రెండు బ్యాచ్‌లు విజయవంతంగా పూర్తయ్యాయి. మూడో బ్యాచ్ కోసం ఆదివారం అర్హత పరీక్ష నిర్వహించారు. ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న పట్టభద్రులు స్కిల్స్ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను తరచూ సందర్శించాలి'' అని మంత్రి శ్రీధర్‌బాబు కోరారు.





# డ్రాగన్–ఎలిఫెంట్‌ల సయోధ్య సాధ్యమా?

20వ 'సెంట్రల్ కమిటీ ఆఫ్ ది కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా' ప్లీనరీలో, ఉన్నత–ప్రమాణాల సోషలిస్ట్ మార్కెట్ ఆర్థిక వ్యవస్థకు సంబంధించి నాణ్యతా ఆర్థికాభివృద్ధితో అత్యున్నత అత్యాధునిక సోషలిస్ట్ దేశంగా చైనాను రూపొందింపజేయాలని 'డ్రాగన్' సంకల్పించింది. ప్రపంచ ఆర్థిక పురోగతికి 30 శాతానికి మించి దోహదపడుతున్న చైనాలో 2024లో ఆరు నెలల్లోనే 26,870 కొత్త విదేశీ –పెట్టుబడి కంపెనీలు వాణిజ్య రంగంలో అడుగుపెట్టాయి. ఆధునిక సోషలిస్ట్ దేశంగా డ్రాగన్, 'వికసిత భారత్ 2047' లక్ష్యంతో పురోగమిస్తున్న భారత్ రెండూ, 280 కోట్ల జనావళి శ్రేయస్సు దిశలో నడుస్తున్నాయి.

ప్రస్తుతం మన దేశంలోని, ప్రతీ రాష్ట్రం, భారీ కార్పొరేట్ రంగ యాజమాన్యాలు మరింత విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల జాయింట్ వెంచర్‌లు, టెక్నాలజీ టై–అప్స్, సమృద్ధిగా ఎగుమతులు సాధించే ఆర్థికాభివృద్ధిని ఆశిస్తున్నాయి. అమెరికా (ట్రంప్ 2.0), చైనా దిగుమతులపై ట్యారిఫ్‌ల పెంపుదల బెదిరింపులు చైనాకు తప్పేటట్టు లేదు. మన ప్రధాన ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ కూడా వర్తక వ్యాపార సమతూక నిర్వహణకు చైనా నుంచి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ఆహ్వానించడం సమయోచితంగా సూచించారు. 2025లో భారత్–చైనా దేశాధినేతల పరస్పర సహకార సౌహార్ద బాంధవ్యానికి 2024 అక్టోబర్‌లో బ్రిక్స్, కజాన్ సమావేశం కొంత సానుకూలత కల్పించింది.

2024 నవంబర్‌లో భారత్–చైనా విదేశీ వ్యవహారాల మంత్రులు జైశంకర్, వాంగ్‌యీ కూడా రియో డి జెనీరోలో ద్వైపాక్షిక చర్చలలో పాల్గొన్నారు. ప్రపంచంలో ద్వితీయ ఆర్థిక సంపన్న దేశంగా 2024లో గుర్తింపు పొందింది. 2023లో మన దేశంతో 136.2 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వర్తక, వాణిజ్య భారీ భాగస్వామ్యం పొందింది. మన దేశపు అత్యంత నాణ్యతా ఉత్పత్తులకు చైనాలో ప్రోత్సాహం ఉండనే ఉంది. 2024లో మన దేశపు మిర్చి, ఇనుప ఖనిజం, పత్తి, నూలు చైనాకు ఎగుమతులలో వరుసగా 17 శాతం, 160 శాతం, 240 శాతాలకు పైగా వృద్ధి సాధించాయి. చైనా, అంతర్జాతీయ దిగుమతుల ఎక్స్‌పో వంటి ప్లాట్ ఫారాల పూర్తి వినియోగానికి భారత్‌లోని అత్యంత నాణ్యమైన ఉత్పత్తులను ఆహ్వానిస్తూనే ఉంది.

చైనా – భారత్‌ల మధ్య నెలకొని ఉన్న సరిహద్దు వివాదం శతాబ్దాల సంఘర్షణల నేపథ్యం పరిశీలిస్తే... అంత సులభంగా పరి ష్కారం కాదని గ్రహించవచ్చు. రుణప్రదాతగా రాజనీతితో వ్యవహరిస్తున్న బడా చైనా సార్వభౌమ ఆధిపత్యపు కోరలలో చిక్కుకొన్న లావోస్, అంగోలా, 16 సబ్ – సహారా దేశాలు, కాంగో, శ్రీలంక, పాకిస్తాన్, బంగ్లాదేశ్, కంబోడియా, నైజీరియా, ఈజిప్ట్ వంటి... మధ్య, స్వల్ప, అల్ప ఆదాయ దేశాలు విలవిలలాడుతున్నాయి. 2017లో శ్రీలంక తన మేజర్ నౌకాశ్రయం హంబన్ తోటను చైనాకు స్వాధీనం చేయవలసి వచ్చింది. టిబెట్‌లో సియాంగ్ నదిపై (అస్సాంలో బ్రహ్మపుత్రా) అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దులలో 60,000 మెగావాట్ ఉత్పత్తి సామర్థ్యం గల ప్రపంచంలోనే అతి పెద్దదైన జల విద్యుత్ కేంద్ర నిర్మాణం తలపెట్టింది.

అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రేమా ఖండూ ఇటీవల జనవరి నెలాఖరులో చైనా అంతర్జాతీయ జల ఒడంబడికలను ఎలా త్రోసిరాజంటున్నదీ చెప్పారు. ఆ భారీ హైడ్రో పవర్ ప్రాజెక్ట్ భవిష్యత్తులో సృష్టించే పెను పర్యావరణ, ప్రకృతి విధ్వంసాన్ని వివరిస్తూ చైనా వైఖరి పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్ని చిక్కుముడుల మధ్య డ్రాగన్–ఎలిఫెంట్ సయోధ్య సాధ్యమా?

# అన్నదొకటి... అయ్యిందొకటి!

కాలక్రమంలో వాడుకలో ఉన్న కొన్ని పదాలు అర్థం కోల్పోతాయని, పైగా వాటికి పూర్తి విరుద్ధ మైన అర్థాలు పుట్టుకొస్తాయని ప్రముఖ రచయిత జార్జ్ ఆర్వెల్ అంటారు. 8 ఏళ్ల క్రితం 'ఒకే దేశం ఒకే పన్ను' అన్నది లక్ష్యంగా, చక్కని సరళతర మైన పన్ను (గుడ్ అండ్ సింపుల్ టాక్స్-జీఎస్‌టీ) గా చెప్ప బడిన 'జీఎస్‌టీ' (గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్) క్రమంగా తన అర్థాన్ని మార్చుకొంది. 2017 జూలై 1న ఎన్డీఏ ప్రభుత్వం అమలులోకి తెచ్చిన జీఎస్‌టీ చిన్న, సన్నకారు వ్యాపారుల సమ స్యలను తీర్చకపోగా వారికి అనేక చిక్కుముళ్లను తెచ్చి పెడుతోంది.

జీఎస్‌టీ అమలులోకి వచ్చాక దేశంలో పన్ను వసూళ్లు గణ నీయంగా పెరిగిన మాట వాస్తవం. ఏటా దాదాపు 8 నుంచి 11 శాతం పైబడి జీఎస్‌టీ వసూళ్లలో వృద్ధిరేటు కనబడుతోంది. ప్రజల కొనుగోలు శక్తి పెరిగితే వస్తు సేవల వినియోగం పెరుగుతుంది.

దాంతో సహజంగానే పన్ను వసూళ్ల మొత్తం పెరుగుతుంది. ఇపుడు జరుగుతున్నది అదే! ఒక దశాబ్ద కాలంలో దేశస్థూల ఉత్పత్తి గణనీ యంగా పెరిగింది. ప్రజల తలసరి ఆదాయమూ హెచ్చింది. కనుక కేవలం జీఎస్‌టీ అమలు కార ణంగానే పన్ను ఎగవేతలు తగ్గాయని, కేంద్రం చెబుతున్నట్లు జీఎస్‌టీ వల్ల దేశంలో 'పన్ను ఉగ్ర వాదం' సమసిపోయిందని చెప్పడం అర్ధసత్యమే. దేశంలో 8 ఏళ్ళుగా అమలవుతున్న జీఎస్‌టీ వల్ల అనేక సమ స్యలు వస్తున్నాయని పలు వర్గాలు గగ్గోలు పెడుతున్నాయి. కానీ, వాటిని పరిష్కరిం చడానికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపడం లేదు. సరళతరమైన పన్నుగా జీఎస్‌టీని చెప్పుకోవడం వరకు బాగానే ఉంది గానీ, ఆ పన్ను రేట్లు, వివిధ శ్లాబులలోకి వచ్చే వస్తువులు, సేవల విషయంలో కేంద్రం, రాష్ట్రాల నడుమ ఇంకా ఏకాభిప్రాయం కుద రకపోవడం గమనార్హం.

ముఖ్యంగా, రాష్ట్రాలకు అతి పెద్ద ఆదాయ వనరు లుగా ఉన్న పెట్రోల్, డీజిల్, మద్యం వంటి వాటిని జీఎస్‌టీ పరిధిలోకి చేర్చడానికి మెజార్టీ రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి. ఇప్పటికి 50కి పైగా సమావే శాలు జరిపినప్పటికీ పలు అంశాలపై కేంద్రం, రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరడం లేదు.

**చిక్కుముళ్లు**

జీఎస్టీ అమలులో అనేక చిక్కుముళ్లు ఉన్నాయి. ఇందులో పన్ను రేట్ల హేతుబద్ధీకరణ ప్రధానమైన ది. జీఎస్‌టీలో 5, 12, 18, 28 శాతాలుగా పన్ను రేట్లు ఉన్నాయి. 1400 పైబడిన వస్తువులు; 500 రకాల సేవలను ఈ 4 శ్లాబులలో సర్దుబాటు చేశారు. భారీ కసరత్తు అనంతరం రేట్లను ఖరారు చేశామని చెప్పారుగానీ అందులో హేతు బద్ధత, మానవత్వం కనుమరుగయ్యాయన్న విమర్శల్ని




సాక్షాత్తూ బీజేపీ నేతలే చేస్తున్నారు.

ఉదాహరణకు జీవిత బీమా (లైఫ్ ఇన్సూ రెన్స్), ఆరోగ్య బీమా (హెల్త్ ఇన్సూరెన్స్) ప్రీమియంలపై 18% జీఎస్‌టీ వసూలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తన సహచర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు బహిరంగ లేఖ సంధించడం కలకలం రేపింది. సామాన్యులకు అవసరమైన జీవిత బీమా, ఆరోగ్య బీమాలపై 18% జీఎస్‌టీ వేయడం వల్ల... వారందరూ జీవితం, ఆరోగ్య రక్షణకు దూరం అవుతారని గడ్కరీ తన లేఖలో పేర్కొన్నారు.

ఇక, శ్లాబుల విషయంలో స్పష్టత లోపించడం వల్ల చెల్లింపుదారులకు, వివిధ ప్రభుత్వ విభాగాల మధ్య వివాదాలు తలెత్తి చివరకు అవి న్యాయస్థా నాలకు చేరుతున్నాయి. అలాగే, కోవిడ్ ప్రబలిన 2020, 2021 సంవత్సరాలలో రాష్ట్రాలకు కేంద్రం అందించిన ఆర్థిక సహకారాన్ని తిరిగి రాబట్టుకొనేందుకు 'సెస్సు' విధించి ప్రజలపై అదనపు భారాన్ని మోపింది. ఈ సెస్సును ఉపసం హరించు కోవాలన్న అభ్యర్థనను సైతం కేంద్రం పెడచెవిన పెట్టింది.

జీఎస్‌టీ పరిధిని క్రమంగా విస్తరిస్తూ పోతున్నారు. శ్లాబ్‌లను మారుస్తున్నారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన ఉత్పత్తులపైన, ప్రాణాలు నిలబెట్టే ఔషధాలపైన కనిష్ఠంగా 5% జీఎస్‌టీని మాత్రమే వేస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తు న్నారు. వెన్న, నెయ్యి, పాలు వంటి పాల ఉత్పత్తుల పైన, ప్యాకింగ్ చేసిన కొబ్బరి నీళ్లు, పండ్ల రసాల పైన 18% జీఎస్‌టీ విధించడం ఏవిధంగానూ సమర్థనీయం కాదు. చివరకు పెన్నులపైన కూడా జీఎస్‌టీ విధిస్తున్నా రు. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో జరిగిన 55వ జీఎస్‌టీ మండలి సమావేశంలో... పిల్లలు ఎక్కు వగా ఇష్టపడే పాప్ కార్న్‌పై 3 రకాల జీఎస్‌టీని విధించడాన్ని ప్రజలు తప్పుబట్టారు.

**ఎంఎస్‌ఎంఈలకు శరాఘాతం**

జీఎస్‌టీ అమలులో స్పష్టత, హేతుబద్ధత లోపించడం వల్ల దెబ్బ తిన్న ప్రధాన రంగాలలో సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల రంగం ఒకటి. దేశీయ తయారీరంగంలో దాదాపు 70% మేర ఉద్యోగ కల్పనకు దోహదం చేస్తున్న ఎంఎస్‌ఎంఈ రంగం జీఎస్‌టీ కారణంగా కుదేలైందన్నది ఓ చేదు వాస్తవం. చిన్న చిన్న వ్యాపారాలను జీఎస్‌టీ పరిధిలోకి తెచ్చాక... అవి చాలా వరకు మూత పడ్డాయి. ముడి సరుకులపై పన్ను విధించడం, మళ్లీ అంతిమ ఉత్పత్తులపై పన్ను వేయడం వల్ల... దేశంలో దాదాపు 20 కోట్ల మంది ఆధారపడిన సూక్ష్మ-మధ్య తరహా పరిశ్రమలకు తీరని నష్టం కలిగింది.

వాటి సప్లయ్ చెయిన్ తెగిపోయిందని ఆ రంగంపై అనేక ఏళ్లుగా జీవనం సాగిస్తున్నవారు మొత్తుకొం టున్నారు. ఒకవైపు వస్తుసేవలను అంతి మంగా వినియోగించుకొనే వారే పన్ను చెల్లించాలని చెబుతూ... మరో వైపు బహుళ పన్నులు వేస్తున్న పరిస్థితి కొన్ని రంగాల్లో ఉంది. వివాదాలు ఏర్పడి తే వాటిని పరిష్కరించుకోవడానికి జీఎస్‌టీ అప్పీ లేట్ ట్రిబ్యునల్‌ను అందుబాటులోకి తెచ్చిన మాట నిజమే గానీ... చిన్న వ్యాపారులు ఎంతమంది దానిని ఆశ్రయించగలరు? ఇక, స్థానిక ప్రజల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా ఆ యా ఉత్ప త్తులపై పన్నులు విధించే హక్కు గతంలో రాష్ట్రాలకు ఉండేది.

ప్రజలకు జవాబుదారీతనం ఎక్కువగా వహించేది రాష్ట్రాలే. కానీ, రాష్ట్రాలకు తమ ప్రాంత ప్రజల ప్ర యోజనాలను పరిరక్షించే అవ కాశం జీఎస్‌టీ వచ్చాక తగ్గిపోయింది. రాష్ట్రాల వినతులకు జీఎస్‌టీ కౌన్సిల్‌లో పూర్తిస్థాయిలో న్యాయం జరగడం లేదన్న వాదన ఉంది. జీఎస్‌టీకి సంబంధించి ఏ యే రాష్ట్రాలు ఎన్నెన్ని అభ్యర్థనలు అంది స్తోంది? అందులో వేటికి ఆమోదం తెలుపు తున్నారు? ఎన్నింటిని బుట్టదాఖలా చేస్తున్నారన్న సమాచారాన్ని వెల్లడించడం లేదు.

నిజానికి, తగిన సన్నద్ధత లేకుండా జీఎస్‌టీని అమలులోకి తేవడం వల్ల ఈ సమస్యలు ఉత్పన్నం అయ్యాయి. జీఎస్‌టీ అమలు లోకి వచ్చి 8 ఏళ్లు గడిచాయి. జీఎస్‌టీ మండలి 55 పర్యాయాలు సమావేశమైంది. అయినా అనేక అంశాలు అప రిష్కృతంగానే ఉన్నాయి. జీఎస్‌టీ వసూళ్లల్లో కనబడుతున్న వృద్ధిని చూసి మురిసి పోవడమే తప్ప... ఎదురవుతున్న ఇబ్బందుల్ని సాధ్యమైనంత తొంద రగా పరిష్కరించలేకపోవడం వైఫల్యంగా నే పరిగణించాలి. పుట్టుక తోనే లోపాలు ఉన్న బిడ్డగా జీఎస్‌టీని కొందరు అభివర్ణించారు. మరి కొందరు జీఎస్‌టీ వల్ల దేశానికి అసలైన ఆర్థిక స్వాతంత్ర్యం లభించిందంటున్నారు. ఈ రెండూ నిజమే కావొచ్చు. కానీ, అంతిమంగా ప్రజ లకు మేలు జరుగుతున్నదా లేదా అన్నదే కొలమానం. రచయిత జార్జ్ ఆర్వెల్ చెప్పినట్లు కొన్ని పదాలు అర్థం కోల్పోవడమే కాక వాటికి పూర్తి భిన్నమైన అర్థాలు పుట్టుకొస్తున్నాయి. ఇందుకు ఉదాహరణ 'సంస్కరణ' అనే పదం. ప్రపంచీకరణ తర్వాత ఈ పదా నికి అర్థం మారిపోయింది. సంస్కరణ అంటే ఆర్థిక భారంగా ప్రజలు భావిస్తు న్నారు. జీఎస్‌టీ అంశంలో కూడా సరళతరమైన పన్ను అనే భావన పోయి జీఎస్‌టీ అంటేనే మోయలేని భారం అని ప్రజలు భయపడే పరిస్థితి ఏర్పడింది.

- జీఎస్‌టీ అమలులోకి వచ్చాక దేశంలో పన్ను వసూళ్లు గణనీ యంగా పెరిగిన మాట వాస్తవం. ఏటా దాదాపు 8 నుంచి 11 శాతం పైబడి జీఎస్‌టీ వసూళ్లలో వృద్ధిరేటు కనబడు తోంది.
- పుట్టుకతోనే లోపాలున్న బిడ్డగా జీఎస్‌టీని కొందరు అభివ ర్ణించారు. మరికొందరు జీఎస్‌టీ వల్ల దేశానికి అసలైన ఆర్థిక స్వా తంత్ర్యం లభించిందంటున్నారు. కానీ, అంతిమంగా ప్రజ లకు మేలు జరుగుతున్నదా లేదా అన్నదే కొలమానం.
- చిన్న వ్యాపారాలను జీఎస్‌టీ పరిధిలోకి తెచ్చాక... చాలా వరకు మూతపడ్డాయి. ముడి సరుకులపై పన్ను విధించడం, మళ్లీ అంతిమ ఉత్పత్తులపై పన్నువల్ల... దాదాపు 20 కోట్ల మంది ఆధా రపడ్డ సూక్ష్మ-మధ్య తరహా పరి శ్రమలకు తీరని నష్టం కలిగింది.

# పవన్ గాలి మళ్లిందా?

ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తెరలేపిన కొత్త డ్రామా ఆసక్తికరంగా ఉంది. దక్షిణాదిలోని పుణ్యక్షేత్రాల సందర్శన పేరుతో ఆయన చేస్తున్న యాత్ర భక్తితో చేస్తున్న దా?లేక రాజకీయ ఉద్దేశాలతోనా అన్న చర్చ జోరుగా నడుస్తోంది. భారతీయ జనతా పార్టీ రాజకీయ వ్యూహంలో భాగంగా పవన్ యాత్ర సాగుతోందా? లేక చంద్రబాబు ముందు తన ప్రా ధాన్యతను నిరూపించుకునేందుకు ఆయన చేస్తు న్నారా? అని కూడా విశ్లేషణలు సాగుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబుకు కూడా తెలియకుం డా పవన్ ఈ యాత్ర చేపట్టడం... ఆయన ఫోన్లకూ స్పందించకపోవడం కచ్చితంగా గమనించదగ్గ అంశాలే. పవన్ బాబుల మధ్య భేటీ జరిగి ఇరవై రోజులవుతోందంటే పరిస్థితి ఏమిటన్నది ఇట్టే అర్థమైపోతుంది. తనకు ఎదురైన అవమానాన్ని, అసమ్మతిని వ్యక్తం చేసేందుకే పవన్ మౌనవ్రతం చేపట్టారా? అన్న అభిప్రాయమూ కొందరు వ్యక్తం చేస్తున్నారు.

తిరుమల లడ్డూ వ్యవహారంలో పవన్ తాను, చంద్రబాబు సమానమే అన్న చందంగా ప్రవ ర్తించడం టీడీపీకి నచ్చలేదు. ఎల్లో మీడియాలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కథనాలు రావడం ఇందుకు నిదర్శనం. అదే సమయంలో పవన్ ఆయా సందర్భాల్లో చంద్రబాబును ఆకాశానికి ఎత్తేయడం కూడా జనసేనకు అంతగా రుచించ లేదు. పవన్ కళ్యాణ్ మరీ అంతగా అణిగిమణిగి ఉండాల్సిన అవసరం లేదన్నది జనసేన కార్య కర్తల అభిప్రాయంగా ఉంది. అంతేకాకుండా.. లోకేష్‌ను ఉప ముఖ్యమంత్రిని చేయాలన్న ఉద్దేశం టీడీపీ నుంచి వ్యక్తం కావడం... దాంతో తమ నేతకు ప్రాధాన్యం తగ్గిపోతుందని, భవిష్యత్తులో లోకేషే ముఖ్యమంత్రి అయితే పవన్ ఎన్నటికీ ఆ స్థానానికి ఎదగలేడని వీరు ఆందోళన చెందారు. ఈ విషయంలో టీడీపీ, జనసేన కార్యకర్తల మధ్య సోషల్ మీడియా యుద్ధమూ సాగింది. పవన్ అన్న అయిన నాగబాబును మంత్రిని చేయబోతు న్నట్లు ప్రకటించి నెలలు గడుస్తున్నా, ఇంతవర కు దాని గురించి చంద్రబాబు మాట్లాడుతున్నట్లు లేరు. ఇది కూడా మిస్టరీగానే ఉంది.

అయితే... తిరుమల లడ్డూ విషయంలో చంద్ర బాబు, పవన్ కళ్యాణ్‌లు ఇద్దరూ అపచారానికి పాల్పడ్డారనడంలో సందేహం లేదు. లడ్డూ ప్రసాదం తయారీలో జంతుకొవ్వు కలిసిందన్న చంద్రబాబు మాటను పవన్ గుడ్డిగా నమ్మి అదే అబద్ధాన్ని చెప్పడం ద్వారా తప్పులో కాలేశారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుపతిలో తొ క్కిసలాట జరిగిన సందర్భంలోనూ టీటీడీ ఛైర్మన్ బి.ఆర్.నాయుడు, మంత్రి లోకేష్‌లు అసలు పవన్ కళ్యాణ్ ఎవరన్నట్టుగా వ్యవహరించారు. తొక్కిసలాటకు బాధ్యత వహించి టీటీడీ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్న పవన్ డిమాండ్‌ను తోసి



పుచ్చడంతో పవన్ పరువు పోయినట్లయింది. ఆ తర్వాత చంద్రబాబు మంత్రులకు ప్రకటించిన ర్యాంకుల్లో పవన్‌కు పదో స్థానం దక్కడం పుండు మీద కారం చల్లినట్టు అయ్యింది. ఫైళ్ల పరిష్కారం లో వెనుకబడ్డ ప్రాతిపదికన ర్యాంకులిచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది. అయితే పవన్ అప్పటికే మంత్రివర్గ సమావేశానికి గైర్హాజరైన విషయం అందరి దృష్టిని ఆకర్షించింది. పవన్ నిజంగానే ఏదైనా అనారోగ్యంతో బాధపడుతున్నారేమోలే, అందుకే రాలేదేమోలే అని పలువురు అనుకున్నా రు. కానీ చంద్రబాబు కీలకంగా పరిగణించిన ప్రభుత్వ కార్యదర్శుల, మంత్రుల సమావేశానికి కూడా పవన్ రాకపోవడంతో వీరిద్దరి మధ్య ఏదో గొడవ జరుగుతోందన్న చర్చ మొదలైంది.

ఆ సమావేశంలోనే చంద్రబాబు డిప్యూటీ సీఎం గురించి మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఆరా తీయగా నడుంనొప్పి వల్ల రాలేకపోయారన్న సమాధానం వచ్చింది. తాను ఫోన్ చేసినా పవన్ అందుబాటులోకి రాలేదని చంద్రబాబు అనడం, ఆ విషయం తెలుగుదేశం పత్రిక ఈనాడులోనే రావడం సంచలనమైంది. టీడీపీ వర్గాలే ఈ సమాచారాన్ని ఎల్లో మీడియాలో వచ్చేలా చేశారా అన్న సందేహమూ వస్తుంది. అంటే పవన్ కళ్యాణ్ సీఎంతో పద్ధతిగా వ్యవహరించలేదన్న సంగతి ప్ర జలకు చెప్పాలని అనుకుని ఉండవచ్చు. దానివల్ల భవిష్యత్తులో పవన్ ఏదైనా అనూహ్య నిర్ణయం తీ సుకున్నా, తప్పు ఆయన వైపే ఉండేలా చేయడం లక్ష్యంగా కనిపిస్తుంది. ఇందుకు తగ్గట్లే చంద్రబా బు కార్యదర్శుల సమావేశంలో ఫైళ్ల అంశాన్ని ప్రస్తావించి, ఫైళ్ల పరిష్కారానికి ఆరు నెలలు, ఏడాదా అని ప్రశ్నించారు. నిజానికి ఫైళ్లు కేవలం కార్యదర్శులు మాత్రమే క్లియర్ చేస్తే సరిపోదని, మంత్రులు, సీఎం కూడా ఆమోదించాలని చం ద్రబాబుకు తెలియంది కాదు. పవన్‌ను ఇరుకున పెట్టడానికి మాత్రమే ఈ సంగతిని ప్రస్తావించారు. గత నెల రోజులుగా పవన్ కళ్యాణ్ పేషీలో వందల కొద్ది ఫైళ్లు పేరుకుపోయాయని చెబుతున్నారు. పంచాయతీరాజ్ శాఖ ఫైళ్లు ఎప్పుడూ పెద్ద సం ఖ్యలోనే ఉంటాయి. విచిత్రం ఏమిటంటే సొంత శాఖలో ఫెయిల్ అయిన పవన్ కళ్యాణ్ ఇతర శాఖలలో జోక్యం చేసుకోవడాన్ని టీడీపీ తెలివిగా వాడుకుంది. దీనిని టీడీపీ ఎక్స్ పోజ్ చేసిందని చెప్పాలి. జనసేన కు చెందిన ఇద్దరు మంత్రులు నాదెండ్ల మనోహర్‌కు, కందుల దుర్గేష్‌కు మంచి ర్యాంకులు ఇచ్చి, పవన్ కళ్యాణ్‌ను పదో ర్యాంకుకు పడవేయడం ద్వారా టీడీపీ ఇవ్వాల్సిన సందేశం ఇచ్చేసినట్లయింది. అంతకు ముందు హోం శాఖ, టూరిజం, సివిల్ సప్లయిస్ మొదలైన శాఖలలో వేలు పెట్టిన పవన్ వల్ల ప్రభుత్వానికి ఇబ్బంది వచ్చింది. రాష్ట్రంలో శాంతి భద్రతలు ఫెయిల్ అయిన విషయాన్ని, సీజ్ ద షిప్ ఘటనలో ప్రభుత్వ అసమర్థతను టీడీపీ యాజమాన్యం చే తకానితనాన్ని ఆయన తనకు తెలియకుండానే బయట పెట్టేశారు. మరో వైపు మంత్రి లోకేష్ అన్ని శాఖలపై పెత్తనం చేస్తూ డిఫ్యాక్టో సీఎంగా ఉన్నార న్న భావన ఉంది. ఇది కూడా పవన్ కు నచ్చడం లేదు. తన పేషీలో అధికారులను కూడా లోకేష్ నియమించారని ఆయన ఆగ్రహం చెందినట్లు వార్తలు వచ్చాయి.

ప్రస్తుతం పోలీసు శాఖ మొత్తం లోకేష్ చెప్పినట్లే వింటోందన్న భావన ఏపీ అంతటా ఉంది. ఆ విష యాన్ని నేరుగా ప్రస్తావించకుండా పిఠాపురంలో పోలీసుల పనితీరును, గంజాయి వంటి మాదక ద్రవ్యాలు యథేచ్ఛగా సరఫరా అవుతున్నాయని పవన్ తప్పుపట్టారు. లోకేష్ రెడ్ బుక్ వ్యవహారం కూడా ఏపీలో గందరగోళం సృష్టిస్తోంది. లోకేష్ శైలిపై పవన్ అసంతృప్తిగా ఉన్నారన్న ప్రచారం కూడా జరిగింది. ఇవన్నీ ఒక ఎత్తయితే చంద్ర బాబుతో కలిసి ఎన్నికలకు ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలు, ఎన్నికల ప్రణాళికపై నోరు విప్పలేని పరిస్థితి పవన్‌కు ఏర్పడింది. అసలు ప్ర భుత్వంలో ఏమి జరుగుతుందో తెలియని అయో మయంలో పవన్ కళ్యాణ్ ఉన్నారు.

ఈ నేపథ్యంలో పవన్ కళ్యాణ్ కు ఏమి చేయాలో తోచక ఈ తీర్థయాత్ర పెట్టుకుని ఉండవచ్చని కొందరు భావిస్తున్నారు.అయితే సీఎంకు చెప్పక పోవడం, ఫోన్‌కు కూడా స్పందించకపోవడంతో పాత ఘటనలన్నిటికి ప్రాధాన్యత ఏర్పడింది. నడుం నొప్పి నిజంగానే అంత తీవ్రంగా ఉండి ఉంటే, కేరళ పర్యటనలో ఎక్కడా అలసట లేకుండా తిరుగుతారా అన్న డౌటు వస్తుంది. ఈ పరిణామాలతో ఇప్పటికిప్పుడు టీడీపీ, జనసేనల మధ్య ఏదో జరిగిపోతుందని చెప్పలేం .చంద్ర బాబు, పవన్ ల మధ్య ఉప్పు, నిప్పులా పరిస్థితి మారిందని అనలేం. కాకపోతే ప్రభుత్వం ఎంత అధ్వాన్నంగా నడుస్తోంది వెల్లడైంది. పవన్ ప్రస్తుతం పవర్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. ఏదో కొంతకాలం అలిగి, తనకు కావల్సినవి సాధించు కోవడానికి ఏమైనా ఇలా చేస్తుండవచ్చు.

మరో వైపు బీజేపీ పవన్ కళ్యాణ్‌ను దక్షిణాది రా ష్ట్రాలలో తిప్పి, రాజకీయ ప్రయోజనాల కోసం యత్నిస్తుందా అన్న సందేహం కూడా చాలా మందిలో ఉంది. భవిష్యత్తులో దక్షిణాదిలో బీజేపీ ఎదగడానికి ఇలాంటి సినీ నటులు కొందరిని వాడుకుంటే వాడుకోవచ్చని చెబుతున్నారు. కేరళలో ఇప్పటికే ప్రముఖ నటుడు గోపికి కేంద్ర మంత్రి పదవి ఇచ్చింది. ఏపీలో పవన్ సోదరుడు, కేంద్ర మాజీ మంత్రి చిరంజీవి తమవైపు ఉన్నట్లు చూపించే యత్నం చేస్తోంది. ఇవన్నీ కూడా రా జకీయాలలో కీలకమైన అంశాలే అవుతాయి. పవన్ కళ్యాణ్‌కు భక్తి విశ్వాసాల మీద కూడా రకరకాల అభిప్రాయాలు ఉన్నాయి. ఆయన ఒకసారి క్రైస్తవ మతానికి, మరోసారి ముస్లిం మతానికి అనుకూలంగా మాట్లాడడం, తన కు టుంబంలోనే తన పిల్లలే క్రైస్తవం తీసుకోవడం వంటి అంశాలు ఆయనపై విమర్శలకు దారి తీ స్తుంటాయి. అధికారం వచ్చాక తిరుమల లడ్డూ ఘటన సమయంలో సనాతని వేషం కట్టారు. ఆ తర్వాత కొన్నాళ్లు మామూలుగానే కనిపించినా, దక్షిణాది తీర్థయాత్రలో మళ్లీ సనాతని వేషంలోకి రావడం అంతా నాటకీయంగా ఉంది.

తన కుమారుడు అకీరా నందన్‌ను ప్రమోట్ చేయ డానికి కూడా ఈ యాత్రను ఆయన వాడుకుంటు న్నట్లుగా కనిపిస్తోంది.రాజకీయంగా అయినా, భక్తిపరంగా అయినా ఆయన చిత్తశుద్ధితో చేస్తే ఎవరూ తప్పుపట్టరు. కానీ ప్రతిదానిని డ్రామా చేస్తూ పబ్బం గడుపుకుంటూ పోతే మాత్రం పవన్ కళ్యాణ్ కే నష్టం జరగవచ్చు.

తెలుగు దినపత్రిక https://aksharagalam.com
అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం



## కొమరవెల్లి మల్లన్నకు 14 కేజీల వెండి ఆభరణాలు అందజేత.

**అక్షరగళం చేర్యాల ప్రతినిధి:** శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎపిటోమ్ ప్రాజెక్ట్స్ కంపెనీ అధినేత కంత శ్రీ విద్య జైపాల్ దంపతులు స్వామివారికి 14 కిలోల వెండి ఆభరణాలను అనగా( విఘ్నేశ్వర స్వామి, మునీశ్వర స్వామి, సంగమేశ్వర స్వామి) విగ్రహాలకు వెండి తొడుగులు అందజేశారు. ఈ ఆభరణాలను వారి తల్లిదండ్రులైన కంత స్వర్ణలత అశోక్ కుటుంబ సభ్యులతో కొమురవెల్లి కి విచ్చేసి ప్రత్యేక పూజలు చేసి ఆలయ దేవాలయ ఈవో కి వెండి ఆవరణం అప్పగించి దేవస్థానం నుండి రసీదు పొందారు. ఈ కార్యక్రమంలో ఈవో బుద్ధి శ్రీనివాస్, ధర్మకర్తలు మండల సభ్యులు లింగంపల్లి శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్ స్థానిక కొమరవెల్లి ఎస్సై రాజు తదితరులు పాల్గొన్నారు.





## వధూవరులను ఆశీర్వదించిన చల్లా వంశీ చంద్ రెడ్డి దంపతులు

**తలకొండపల్లి ఫిబ్రవరి 16 (అక్షర గళం):** రంగారెడ్డి జిల్లా కల్వకుర్తినియోజకవర్గం మాడ్గుల్ మండల అవురుపల్లి గ్రామానికి చెందిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంత్ రెడ్డి విజయశ్రీ నూతన వధూ వరులను ఆశీర్వదించిన సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు చల్ల వంశీచంద్ రెడ్డి ఆశ్లేష రెడ్డి వారితోపాటు స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి పీసీసీ సభ్యులు ఆయిల్లా శ్రీనివాస్ గౌడ్ అమనగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీమ్ డిసిసి కార్యదర్శి రవీందర్ యాదవ్ బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డిగ్రీ కృష్ణ మైనారిటీ మండల అధ్యక్షులు ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.



## మృతి రాలి కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు 6000/ రూ ఆర్థిక సహకారం

**తలకొండపల్లి ఫిబ్రవరి 16( అక్షరం గళం):** తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కటిక వెంకటేష్, అమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తలకొండపల్లి మండల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్ రెడ్డి, పూల బాయి కుటుంబాన్ని పరామర్శించారు. వారి కుటుంబానికి 3000/రూ వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు . అనంతరం తలకొండపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మీసేవ మల్లేష్, పోతుగంటి గణేష్, తుమ్మ నరసింహ, వారు వంతు సాయంగా 3000 / రూపాయలు బాధిత కుటుంబాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో , గ్రామ అధ్యక్షుడు పెరమళ్ళ రమేష్, జిల్లా నాయకులు రవీందర్ యాదవ్, మార్కెట్ డైరెక్ట్ అజీమ్, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు డిగ్రీ కృష్ణ, రామ్మోహన్ రెడ్డి, యాదగిరి, అంజయ్య, అమరేందర్, రమేష్ ,పోతుగంటి సురేష్, శ్రీను, సుదర్శన్, పోతుగంటి మల్లేష్, శశి, మైసయ్య, తదితరులు పాల్గొన్నారు.



## కొమరవెల్లిలో భక్తుల సందడి

**అక్షరగళం చేర్యాల ప్రతినిధి:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొమరవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో భక్తుల సందడి నెలకొంది. మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ ఆదివారం రోజున తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ కరీంనగర్ రంగారెడ్డి సిద్దిపేట్ పళ్ళు జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మల్లన్న దర్శించుకుని పూజలు చేశారు. ఆలయంలోని గంగరేణు చెట్టు కింద పట్నాలు వేసి, స్వామివారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మరి కొంతమంది భక్తులు మల్లికార్జున స్వామికి, బలిజ మెడలదేవికి, గొల్ల కేతములకు ఓడు బియ్యం పోశారు. భక్తుల రద్దీ ఎక్కువ ఉండటంతో స్వామివారి దర్శించుకునేందుకు సుమారు దాదాపు రెండు గంటల సమయం పట్టింది. ఇదిలా ఉండగా ఆలయ వర్గాలు ఎప్పటికప్పుడుపర్యవేక్షించారు 170 మందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు సిఐఎల్ శీను. ఐదవ ఆదివారం సందర్భంగా పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం 170 మందితో పోలీసు అధికారులు సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారని, సీసీ కెమెరాలు ద్వారా కొమరవెల్లి పోలీస్ స్టేషన్లో నిరంతరం పర్యవేక్షణ జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి ఎస్సై రాజు, మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్ మరియు పోలీసు అధికారులు తదితర సిబ్బంది పాల్గొన్నారు.





## కమనీయం.. భవాని రామలింగేశ్వర స్వామి కళ్యాణం

**ఆమనగల్లు, ఫిబ్రవరి 16 (అక్షర గళం) :** ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని అయ్యప్పకొండ ప్రాంగణంలో ఉన్న శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలు ఆలయ నిర్మాణ దాత రేగట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మూడవ రోజు శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి కళ్యాణం వేదమంత్రోచ్చారణల మధ్య కనుల పండువగా ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీశ్రీశ్రీ శివానంద స్వామి పాల్గొన్ని ప్రత్యక పూజలు, రుద్రాభిషేకం చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను మూలవిరాట్లకు పట్టువస్త్రాలు సమర్పించి మేళ తాళాలు, భాజా భజంత్రీలతో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. రేగాటి శ్రీలత శ్రీనివాసులు, లక్ష్మమ్మ సాయిలు, శిరీష సాయికిరణ్, నాగులపల్లి సుష్మిత శ్రీకాంత్ దంపతులు కళ్యాణంలో కూర్చున్నారు. అర్చకులు మల్లికార్జున, చంద్రశేఖర్, మహేష్, శివకుమార్, అక్షయ్ కుమార్ అంగరంగ వైభవంగా కళ్యాణం నిర్వహించారు. ఈ వేడుకలకు మాజీ జాతీయ బీసీ కమిషన్ మెంబర్ తల్లోజు ఆచారి పాల్గొన్ని పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి కళ్యాణాన్ని తిలకించారు. శివ స్వాములు గాజుల పుల్లయ్య, బిట్టు శ్రీనివాసులు, గోపాల్, నాగిళ్ళ శ్రీను, శ్రీనివాస్ రెడ్డి, అశోక్, గోవర్ధన్, రాజశేఖర్, వెంకట్ బిట్టు, దుర్గాప్రసాద్, దేవరాజ్, శివ, బొల్లు శివ, గణేశ్, అమర్, శేఖర్, పాతకోట రాజు, కుమార్ గౌడ్ తదితరులున్నారు.



## బి ఆర్ ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం

**వెల్దండ ఫిబ్రవరి 16 (అక్షర గళం):** వెల్దండ మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాజీ ఎమ్మెల్యే ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 18 న ఆమనగల్ పట్టణంలో నిర్వహించనున్న రైతు దీక్షకు బిఆర్ఎస్ పార్టీ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వస్తున్న సందర్భంగా సంబంధించిన సన్నహక సమావేశాన్ని విజయవంతం చేయాలని అని అన్నారు కాంగ్రెస్ పార్టీ హామీల అమల్లో సర్కార్ విఫలమైందన్నారు ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజుల్లో దగ్గర్లోనే ఉన్నాయని హామీలను అమలు చేయకుండా ప్రతిపక్ష నాయకులను ఇబ్బంది పెడుతున్నారు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని మండిపడ్డారు ఈనెల 18న ఆమనగల్ మండల కేంద్రంలో నిర్వహించనున్న రైతు దీక్షలు బీ ఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొంటారని ఈ సందర్భంగా తెలిపారు బి ఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు ఈ దీక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు ఈ కార్యక్రమంలో వెల్దండ మాజీ ఎంపీపీ పుట్ట రామ్ రెడ్డి మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్య గౌడ్ మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి కుప్పగండ్ల మాజీ సర్పంచ్ శేఖర్ ముదిరాజ్ మాజీ ఎంపీటీసీ హనుమంతు నాయక్ మాజీ ఎంపీటీసీ బసమోని లింగం సీనియర్ నాయకులు చంద్రమోహన్ రెడ్డి భాస్కర్ రావు చల్లా మధుసూదన్ రెడ్డి వెంకటేశ్వరరావు తిరుమల రావు పూరి రమేష్ అంజయ్య అంజి నాయక్ బాల్ లక్ష్మయ్య దేవేందర్ శేఖర్ పర్వతాలు జంగిలి ఆనంద్ కొండల్ శ్రీనివాస్ రెడ్డి తిరుపతి రెడ్డి కొమ్ము నాగయ్య మంగళగిరి సత్యం జంగిలి ప్రవీణ్ జంగిలి శ్రీనివాసులు జంగిలి రవికుమార్ ఈదులపల్లి జగన్ ప్రభాకర్ జోగు రవికుమార్ ఈదులపల్లి శ్రీనివాసులు జంగయ్య లాలయ్య రాములు తదితరులు పాల్గొన్నారు.





## రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కాంగ్రెస్

**- మాజీ మంత్రి లక్ష్మారెడ్డి**
**- రైతు నిరసన దీక్ష సభ ఏర్పాట్లను పరిశీలించిన మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు**

**ఆమనగల్లు, ఫిబ్రవరి 16 (అక్షర గళం) :** రైతు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన రీతిలో బుద్ధి చెప్పాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయక కాలయాపన చేస్తున్నందుకు నిరసనగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ఈనెల 18న ఆమనగల్లు పట్టణ కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న రైతు నిరసన దీక్షకు బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్ రానున్నారని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి తెలిపారు. ఆదివారం కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ గుప్తా, డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, మాజీ జెడ్పిటిసి జర్పుల దశరత్ నాయక్, మున్సిపల్ కన్వీనర్ పత్యనాయక్, స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించి మాట్లడారు.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయక రైతులను, ప్రజలను నిరుద్యోగులను మోసం చేస్తుందని ఆరోపించారు. కేటీఆర్ ఆధ్వర్యంలో తలపెట్టిన రైతు నిరసన దీక్షకు నియోజకవర్గంలోని బిఆర్ఎస్ శ్రేణులు అభిమానులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఆయన వెంట మాజీ జెడ్పిటిసి నరసింహ, తలకొండపల్లి మాజీ ఎంపీపీ నిర్మల శ్రీశైలం గౌడ్, మాజీ సర్పంచులు శ్రీను నాయక్, జోతయ్య, బిఆర్ఎస్ నాయకులు సయ్యద్ ఖలీల్, గుత్తి బాలస్వామి, గంప శ్రీను, శేఖర్, సంతోష్, దినేష్, వడ్డే వెంకటేష్, సైదులు గౌడ్, నాగిళ్ల జగన్, ఎనుమల్ల రమేష్, చలిచీమల సతీష్, ఇమ్రాన్, శేఖర్, యాదయ్య, గణేష్, దేవేందర్, పంతు, చంద్రశేఖర్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## ఖురాన్ తోనే మానసిక ప్రశాంతత

**తయ్యాబ్ షా కలిముల్ల హుసేని**
**మౌలానా సయ్యద్ రవూఫ్ అలీ ఖాద్రి**
**- ఘనంగా మదర్సా 11వ వార్షికోత్సవ వేడుకలు**

**ఆమనగల్లు, ఫిబ్రవరి 16 (అక్షర గళం) :** పవిత్ర గ్రంథం ఖురాన్ ను చదవడం. నేర్వడం, ఆచరించడం ద్వారా ప్రతి మనిషికి మానసిక ప్రశాంతత లభిస్తుందని తయ్యాబ్ షా కలిముల్ల హుసేని, మౌలానా సయ్యద్ రవూఫ్ అలీ ఖాద్రి ముల్తాని అన్నారు. ఎప్పుడైతే మనిషి ప్రశాంతంగా ఆలోచించడం మొదలుపెడతాడో అప్పుడు సమాజంలో ఏ సమస్యలు తలెత్తబోవని, తద్వారా అది మానవాళి వికాసానికి దోహదం చేస్తుందని పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలోని బిఎన్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో ఆదివారం జష్ నే దస్తార్ బంది వ తఖ్సిమే సనద్ అజీమ్ వ షాన్ జల్సా, మదర్సా దారుల్ ఉలుం అన్వరే ముస్తఫా 11వ వార్షికోత్సవ వేడుకలు మదర్సా ప్రిన్సిపల్ మౌలానా అబ్దుల్ కరీం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మదర్సా విద్యార్థులు ఖురాన్ పఠనం



పూర్తి చేసి హాఫిజ్ ఖురాన్ అయ్యారు. అందులో భాగంగా ఏర్పాటు చేసిన జల్సా కార్యక్రమంలో ముఖ్య అతిథులు తయ్యాబ్ షా కలిముల్ల హుసేని బంధనవాజి ఆల్ మారుఫ్ ఖాశిక్ పాషా సహాబ్, హజ్రత్ అల్లామా, మౌలానా సయ్యద్ రవూఫ్ అలీ ఖాద్రి ముల్తాని సాహెబ్ కిబల సదర్ ముదరిస్ దారులుమ్ అరేబియా కౌరంపేట్ వారు పాల్గొని మదర్సా విద్యార్థులు మీర్జా సోహెల్ బేగ్, మీర్జా సానియా బేగం, సబా బేగం, అలియా ఫాతిమా, మహ్మద్ చాంద్ రజా, మహ్మద్ గరీబ్ నవాజ్, మహ్మద్ తౌకిర్ రజా, మహ్మద్ మేరాజ్ ఆలం, మహ్మద్ సైఫాన్ ఖాన్ లకు సర్టిఫికెట్ పంపిణి చేసి విద్యార్థుల తల్లిదండ్రులను పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. ఇస్లాం మత పవిత్ర గ్రంథం ఖురాన్ ను పూర్తిగా అవపోశన పట్టి, అందులోని మంచిని పదిమందికి బోధించడానికి సంసిద్ధం కావడం నిజంగా అభినందనీయమన్నారు. మదర్సాలో ధార్మిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు హాఫీజ్ ఏ ఖురాన్ పూర్తిచేయడం చాలా సంతోషకరమని ఖురాన్ యొక్క బోధనలను హజరత్ మహమ్మద్ ప్రవక్త యొక్క ఆచరణలను ప్రపంచానికి ఆదర్శప్రాయంగా అందించాలని ఆయన ఆకాంక్షించారు. మనిషి జీవితంలో స్థిరపడడానికి విద్య ఎంతగానో దోహదపడుతుందని గ్రామీణ ప్రాంతాలలో పేద విద్యార్థులకు విద్యను అందించేందుకు ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి విద్యా సంస్థలను నెలకొల్పడంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణంలో గత పదిహేను సంవత్సరాలుగా మదర్సాను స్థాపించి ఉచితంగా విద్యార్థులకు విద్యతో పాటు మధ్యాహ్న భోజనాన్ని అందించి సేవలు అందిస్తున్న మదర్సా ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖరీంను ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం హాఫిజ్ ఎ ఖురాన్ అయిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మదర్సా అధ్యక్షులు సయ్యద్ ఖలీల్, నాయబ్ సదర్ మహబూబ్, మదర్సా కమిటీ సభ్యులు ఆయా మండలాల మైనార్టీ సోదరి సోదరులు పాల్గొన్నారు.





# వైభవంగా శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్టాపన

**కుత్బుల్లాపూర్,ఫిబ్రవరి 16,( అక్షర గళం):** సూరారం డివిజన్ వైష్ణవి నగర్ నందు నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయ ధ్వజస్తంభ ప్రతిష్టాపన ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన యాగంలో పాల్గొని స్వామి వారి అశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మనం చేపట్టే ప్రతి కార్యక్రమంలో విఘ్నాలను తొలగించి శుభాలను చేకూర్చే లక్ష్మీ గణపతి స్వామివార న్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కోపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, మాజీ కౌన్సిలర్ జక్కుల కృష్ణ యాదవ్, వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు వేమన్ రెడ్డి, యాదగిరి, అధ్యక్షులు వెంకట నరసయ్య, ప్రధాన కార్యదర్శి నాగభూషణం, ఆలయ కమిటీ సభ్యులు రాము, శ్రీనాథ్ రెడ్డి, నరేందర్ రెడ్డి, దొర బాబు తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా రేణుక ఎల్లమ్మ తల్లి అమ్మవారి రజతోత్సవ వేడుకలు**

గాజులరామారం చిత్తారమ్మ దేవి దేవాలయం లోని రేణుక ఎల్లమ్మ తల్లి అమ్మవారి "రజతోత్సవ వేడుకలు (జాతర) ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బిఆర్ఎస్ పార్టీ విప్ , కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ రేణుక ఎల్లమ్మ అమ్మవారి కరుణాకటాక్షాలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజ్, మూసా ఖాన్, తారా సింగ్, తెలంగాణ సాయి, సుంకరి చందు, విజయ్, శ్రీశైలం, ప్రసాద్, జగద్గిరిగుట్ట శ్రీ వేంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**మెట్కని గూడ లో....**

గాజుల రామారం మెట్కని గూడ లోని శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం నందు నిర్వహించిన జాతర కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై మల్లికార్జున స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజ్, మూసా ఖాన్, తారా సింగ్, తెలంగాణ సాయి, సుంకరి చందు, విజయ్, శ్రీశైలం, ప్రసాద్, జగద్గిరిగుట్ట శ్రీ వేంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, శివ నాయక్, మల్లికార్జున స్వామి ఆలయ కమిటీ సభ్యులు పరిశే శ్రీనివాస్ యాదవ్, పాండు యాదవ్, మల్లేష్ యాదవ్, బాల్ రాజ్ యాదవ్, ఆంజనేయులు యాదవ్, యాదగిరి యాదవ్, సత్యనారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## ఆమనగల్లు లయన్స్ క్లబ్ కు అవార్డుల పంట

**ఆమనగల్లు, ఫిబ్రవరి 16 (అక్షర గళం) :** లయన్స్ క్లబ్ రీజియన్ మీట్ సమావేశం రీజియన్ చైర్ పర్సన్ లయన్ డాక్టర్ తెప్ప శ్రీను ఆధ్వర్యంలో తేజా కన్వెన్షన్ హాలు నాగర్ కర్నూల్ లో జరిగిన సమావేశంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు కు అవార్డుల పంట పండిందని లయన్స్ క్లబ్ పిఆర్ఓ పాష తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు 2024 2025 సంవత్సరానికి గాను చేసిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డులు లభించాయని పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు, కంటి వైద్య శిబిరాలు, మెగా హెల్త్ క్యాంపులు, మధుమేహ పరీక్షల శిబిరాలకు, మీల్స్ అండ్ వీల్స్ ఉచిత అన్న ప్రసాదాల కార్యక్రమాలకు, క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్లకు అత్యధికంగా ఎంజెఎఫ్, పిఎంజెఎఫ్ క్లబ్ అడ్మినిస్ట్రేషన్ కు వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేయించుట పాఠశాలలో మౌలిక వసతులు కల్పించుట, పర్మినెంట్ ప్రాజెక్టులకు ఈ అవార్డులు లభించినట్లు పాషా తెలిపారు. ఈ సంవత్సరం 2024 2025 అవార్డులు రావడానికి గాను సహకరించిన లయన్స్ క్లబ్ మల్టిపుల్ ఏరియా లీడర్ లయన్ సందడి నరేందర్ రెడ్డి, మల్టిపుల్ కోఆర్డినేటర్ లయన్ జి. చెన్న కిషన్ రెడ్డి, మాజీ గవర్నర్లు జూలూరి రమేష్ బాబు, ఎస్ రాధాకృష్ణ, రామ్ రెడ్డి లయన్స్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ వి. దామోదర్ రెడ్డి, జోన్ చైర్ పర్సన్ సంపతి జనార్దన్ రెడ్డి లకు మరియు క్లబ్ సభ్యులకు జిల్లా చైర్మన్ లకు అభినందనలు తెలియజేశారు.



# అణగారిన వర్గాల అశాజ్యోతి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్

**రాజ్యంగ ఫలాలు అందరికి అందేలా చూడడమే వారికి మనమిచ్చే ఏకైక నివాళి**

**కీసర, ఫిబ్రవరి 16,(అక్షర గళం):** నవభారత రాజ్యంగా నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఈ దేశంలోని అణగారిన వర్గాలకు అశాజ్యోతిగా నిలిచారని ఆయన ఇచ్చిన స్ఫూర్తితో మనకు రావాల్సిన హక్కుల సాధన కోసం పోరాడి రాజ్యంగా ఫలాలను అందరికి అందేలా చూడటమే మనము అంబేద్కర్ రమాబాయ్ దంపతులకు మన మిచ్చే ఘన నివాళి అని దళిత బహుజన మహిళ నేతలు అన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ గృహ కల్ప కాలనీ లో మాల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతీ ఆదివారం అంబేద్కర్ జ్ఞాన మాల కార్యక్రమంలో భాగంగా ఈ ఆదివారం 150వ అంబేద్కర్ జ్ఞాన మాల, రామాబాయి అంబేద్కర్ జయంతి కార్యక్రమానికి ముఖ్యతిథులుగా మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈగ శ్వేత, మాజీ కౌన్సిలర్ మంగళపూరీ వెంకటేష్ , కాంగ్రెస్ మహిళ నాయకురాలు గుజ్జుక నర్మద, మాల సంఘం మాజీ అధ్యక్షురాలు పాడుగుల రూపా పాల్గొనీ, జ్ఞాన మాల సమర్పించి అనంతరం వారు మాట్లాడుతూ నేడు మనం అనుభవిస్తున్న ఫలాలు అన్ని కూడా ఆయన రాసిన రాజ్యంగం నుండి అందించిన ఫలాలేనని అన్నారు. ఆకలి, అసమానతలు లేని సమసమాజ స్థాపన కోసం ఆయన అహో రాత్రులు పోరాడి మన కోసం హక్కులను సాధించి పెట్టారని అన్నారు. ఆయన ఆశయ సాధనను ముందుకు తీసుకెళ్ళడమే మనం ఆయనకిచ్చే అసలైన నివాళి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు సంఘం మేడ్చల్ జిల్లా కన్వీనర్ గుజ్జుక పరుశురాం , ఆర్జికే కాలనీ సంఘం అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ , మాల సంఘం పెద్దలు పాడుగుల చంద్రమౌళి, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు గొల్లూరి రాజు, కోశాధికారి చెన్నయ్య, సభ్యులు వెంకటేష్, గౌతమ్, శ్రీనివాస్ , దుబాయ్ రాజు, బిఎస్ రావు, కేవి రావు, మనోజు, వీరేశం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తన లక్ష్యం

**కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 16, ( అక్షర గళం):** ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తన లక్ష్యమని బి.ఆర్.ఎస్.పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ పరిధిలోని జయరామ్ నగర్ లో రూ. 90 లక్షల వ్యయంతో పూర్తిచేసిన సీసీ రోడ్లను ఆదివారం ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ మాట్లాడుతూ ఏ ప్రభుత్వంమైనా ప్రజా సంక్షేమం కోసమే కృషి చేయాలన్నారు. రహదారులను నిర్మించి ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు అందించడమే లక్ష్యంగా నిరంతరం అభివృద్ధి పనులను చేపట్టాలని తెలిపారు.. అనంతరం తమ కాలనీలో నాణ్యమైన రహదారులు అందుబాటులోకి రావడానికి కృషి చేసినందుకు ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చెరుకుపల్లి తారా చంద్రా రెడ్డి, సంక్షేమ సంఘం అధ్యక్షులు కుంటి మల్లేష్, ప్రధాన కార్యదర్శి మన్నే హరినాథ్, ఉపాధ్యక్షులు లింగ బిక్షపతి, చైర్మన్ ఆర్ నరసింహ, కోశాధికారి ఎన్ చంద్రయ్య, సభ్యులు రాములు ఉపేందర్, నరేష్, అజయ్, కుమార్, యాది, రమేష్, ఈశ్వర్, సత్యనారాయణ, మల్లేష్, సత్తిబాబు, మహేష్, క్రాంతి, స్థానిక నాయకులు కుంట సిద్ధిరాములు, సంపత్ మాధవరెడ్డి, నరేందర్ రెడ్డి, సమ్మయ్య నేత, పోలే శ్రీకాంత్, విజయ హరీష్, రాములు యాదవ్, కాలనీవాసులు పాల్గొన్నారు.




## సంజీవరెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన ప్రసాద్

**ఆమనగల్లు, ఫిబ్రవరి 16 (అక్షర గళం:** ఐఎన్టియుసి జాతీయ అధ్యక్షుడు డి సంజీవరెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం హైదరాబాద్ ఆర్టీసీ భవన్ లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఆమనగల్లు పట్టణ కేంద్రానికి చెందిన ఐఎన్టిసి జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి కు పూలమాల శాలువాతో సత్కరించి, పుష్పగుచ్చం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలను ఐఎన్టీయూసీ రాష్ట్ర నాయకులు బంగారి పర్వతాలు, సాయిబాబు, మాధవ రెడ్డి, లక్ష్మణ్ తదితరులున్నారు.



## అంబ రామలింగేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలకు ఎంపీ డాక్టర్ మల్లు రవి కి ఆహ్వానం పత్రిక అందజేత

**వెల్దండ ఫిబ్రవరి 16 (అక్షర గళం):** వెల్దండ మండలంలోని గుండాల అంబ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 26 నుండి బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి ఈ సందర్భంగా నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవిని హైదరాబాదులోని ఆయన నివాసంలో దేవాలయ కమిటీ సభ్యులు అర్చకులు కలిసి ఎంపీ మల్లు రవి ను శాలువలతో సన్మానించి బ్రహ్మోత్సవాలకు ఆహ్వాన పత్రికను అందించారు ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ మల్లెపల్లి సందీప్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోతిలాల్ నాయక్ తాలూకా కిసాన్ సెల్ అధ్యక్షులు పర్వత్ రెడ్డి సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షులు కొయ్యల పుల్లయ్య శేఖర్ కమిటీ సభ్యులు కొమ్ము అంజయ్య అర్చకులు నరహరి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.







# బఫర్ జోన్ లో అక్రమ నిర్మాణాలు

**హైడ్రా నిబంధనలకు విరుద్ధంగా ఎఫ్ టిఎల్ బఫర్ జోన్ లో అక్రమ నిర్మాణాలు..**
**సర్వే నెంబర్ 110,112 రాంపల్లి చెరువు ఎఫ్ టిఎల్, బఫర్ జోన్ లలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ భవన నిర్మాణాలు..**
**నాగారం మున్సిపల్ పరిధి రాంపల్లి చెరువు ఎఫ్ టి ఎల్ పరిధిలో అక్రమ భవన నిర్మాణాలు**
**కబ్జాకు పాల్పడిన అక్రమ భూమి కబ్జాదారులకు ఇరిగేషన్ శాఖ అధికారుల వత్తాసు..**
**హైడ్రా అధికారులు చెరువుల కబ్జాపై తక్షణమే చర్యలు తీసుకోవాలి**
**అమ్యామ్యాలకు కక్కుర్తి పడి బఫర్ జోన్ లో నిర్మాణాలకు అనుమతులు..**






**కీసర, ఫిబ్రవరి 16,(అక్షర గళం) :** ప్రభుత్వ స్థలాలు,చెరువులు,కుంటల కబ్జాలు ఆగడం లేదు. అక్రమార్కులు ఎఫ్ టి ఎల్ బఫర్ జోన్ను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు.ఆక్రమణలు జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటిని అడ్డుకోవాల్సిన అధికారులు వారికే వంతపాడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. తాజాగా నాగారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లి గ్రామ పరిధిలోని చెరువు ఎఫ్ టి యల్ బఫర్ జోన్ లో అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేపట్టడం దేనికి సాంకేతం. . అమాయక ప్రజలను ఎన్నో ఆశలు చూపెట్టి అక్రమంగా ఎఫ్ టి ఎల్ జోన్ లో నిర్మించిన భవనాలను అమ్ముకొని అక్రమంగా దండుకుంటున్న భూకబ్జాదారుల నిర్వాకం పై సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించి తక్షణమే చర్యలు చేపడుతూ..ఈ అక్రమ నిర్మాణాలపై హైడ్రా అధికారులు తక్షణమే రాంపల్లి చెరువు సమీపంలోని ఎఫ్ టి ఎల్ బఫర్ జోన్లో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.నాగారం మున్సిపల్ పరిధి రాంపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 110,112, రాంపల్లి చెరువు స మీపంలోని ఎఫ్ టి ఎల్, బఫర్ జోన్లలో నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం నిబంధనలను తుంగలో తొక్కి సాయి శ్రీనివాస ఎంక్లేవ్ లో ప్లాట్ నెంబర్ 37,38,39,లలో ఏకంగా రెండు భవనాలను (డూప్లెక్స్) నిర్మాణాలతో యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి.రాంపల్లి చెరువు బఫర్ జోన్లో నిర్మిస్తున్న ఆక్రమ నిర్మాణాలపై నాగారం మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేసిన స్పందించడం లేదని స్థానిక ప్రజలు కమిషనర్ తీరుపై మండిపడుతున్నారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాల్సిన స్థానిక కమిషనర్ అక్రమాలపై కన్నెత్తి చూడకపోవడం అనుమానాలకు తావిస్తుంది. రాంపల్లి చెరువు ఎఫ్ టి ఎల్ బఫర్ జోన్ లో అక్రమ నిర్మాణాలపై స్థానికులు మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు చేసిన ఈ అక్రమ నిర్మాణాలపై ఇటువంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరం.బఫర్ జోన్ లో నిర్మించిన భవనాల పై ఇరిగేషన్ అధికారులు రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ జరిపి రాంపల్లి చెరువు ఎఫ్ టి ఎల్ బఫర్ జోన్ కాపాడాలని రాంపల్లి స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## స్వామి వారి కరుణా కటాక్షలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

**కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

**కుత్బుల్లాపూర్,ఫిబ్రవరి 16, (అక్షరగళం ):** స్వామి వారి కరుణా కటాక్షలతో ప్రజలంతా సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని బిఆర్ఎస్ పార్టీ విప్,ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ జీడిమెట్ల డివిజన్ దండమూడి ఎంక్లేవ్ నందు గల శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగా వైభవంగా నిర్వహించారు. స్వామి వారి కళ్యాణ మహోత్సవానికి బిఆర్ఎస్ పార్టీ విప్,ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రాజశేఖర్ రెడ్డి, ఇంద్రా రెడ్డి, కిరణ్ కుమార్, ప్రభాకర్ రెడ్డి, వేణు గోపాల్, వెంకట్ , పుప్పాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## తిరిగొచ్చాక పెన్సిల్ లేపినా వర్కౌట్‌లానే.. గ్రావిటీతో సునీతా విలియమ్స్‌కు ఇబ్బందులు..!

అనుకోని పరిస్థితుల్లో అంతరిక్ష కేంద్రంలో ఉండిపోవాల్సి వచ్చిన ఇద్దరు నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్ బుచ్ విల్మోర్ తిరుగు ప్రయాణం దాదాపు ఖరారైంది. ఎనిమిది నెలల ఎదురుచూపుల తర్వాత.. మార్చి 19న వారు భూమి మీదకు బయల్దేరనున్నారు. జీరో గ్రావిటీ నుంచి గురుత్వాకర్షణ కలిగిన వాతావరణంలోకి రానున్న వారికి సమస్యలు తప్పవట. పెన్సిల్ లేపినా వర్కౌట్ చేసినట్టే ఉంటుందట. ఈవిషయాన్ని విల్మోర్ మీడియాకు వెల్లడించారు. ''గ్రావిటీలో చాలా ఇబ్బందిగా అనిపిస్తుంది. భూమిపై పరిస్థితులకు సర్దుకుపోయే క్రమంలో అసౌకర్యంగా ఉంటుంది. శరీరమంతా భారమైన భావన కలుగుతుంది. పెన్సిల్ ఎత్తినా వర్కౌట్‌తో సమానమవుతుంది'' అని విల్మోర్ వెల్లడించారు. స్పేస్‌లో తెలియాడుతూ ఉండే వ్యోమగాములు.. భూమి మీదకు వచ్చిన 24 గంటల్లో ఆ ప్రత్యేక అనుభూతికి దూరమవుతూ ఉంటారు. ఇదేగాకుండా అంతరిక్షంలో ఎక్కువ కాలం ఉండటం కూడా వారి ఆరోగ్య పరిస్థితిపై ప్రభావం చూపుతుంది. ఒక వ్యోమగామి అంతరిక్షంలోకి ప్రవేశించిన వెంటనే శరీరం స్పేస్ ఎనీమియాకు గురవడం మొదలవుతుందని నాసా నివేదిక చెబుతోంది. ఎర్రరక్తకణాలను నాశనం చేయడం ద్వారా మైక్రోగ్రావిటీ పరిస్థితుల్లో శరీరం ఆక్సిజన్ అవసరాలను తగ్గించుకుంటుంది. శరీరంలో సమతుల్యతను కాపాడే క్రమంలో వాటి సంఖ్య తగ్గిపోతూ ఉంటుంది. దాంతో అలసట, నిస్సత్తువ, శారీరక, మానసిక పనితీరు దెబ్బతినడం వంటి లక్షణాలు కనిపించొచ్చు. అలాగే గుండె పనితీరు దెబ్బతినే అవకాశమూ ఉంది. ఎముకల సాంద్రత తగ్గిపోతుంది. బోయింగ్ క్రూ ఫ్లైట్ టెస్ట్‌లో భాగంగా నాసా గత జూన్‌లో ఈ ప్రయోగాత్మక పరీక్ష చేపట్టింది. అయితే వారంలోగా వ్యోమగాములు భూమి పైకి తిరిగి రావాల్సిఉంది. కానీ, ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ యాత్రలో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. వాహక నౌక థ్రస్టర్లలో లోపాలు తలెత్తటంతో పాటు హీలియం లీకేజీ సమస్యగా పరిణమించింది. దీంతో అందులో ప్రయాణించడం సురక్షితం కాదని నాసా తేల్చింది. దాంతో ఎనిమిది నెలలుగా వారు అంతరిక్ష కేంద్రంలోనే ఉండిపోయారు. స్పేస్‌ఎక్స్‌కు చెందిన డ్రాగన్ వ్యోమనౌకలో వారు తిరిగి భూమి మీదకు బయల్దేరనున్నారు.

## పిల్లల ఇన్‌స్టా కంట్రోల్స్ ఇక మీ చేతుల్లోనే.. ఇలా చేయండి..!



స్కూల్ నుంచి పిల్లలు ఇంటికి రాగానే స్మార్ట్‌ఫోన్ అందుకుంటున్న రోజులివి. అంతేనా.. సొంతంగా ఇన్‌స్టా వంటి సామాజిక మాధ్యమాలనూ వాడుతున్నారు. రీల్స్‌లో పడి గంటలు తరబడి ఫోన్ చూస్తూ ఉండిపోతున్నారు. దీంతో తమ పిల్లలు ఎలాంటి కంటెంట్ చూస్తున్నారు? ఎవరితో మాట్లాడుతున్నారు? అనే ఆందోళనలు తల్లిదండ్రులను వెంటాడుతున్నాయి. ఇలాంటి వారి కోసమే మెటా ఇన్‌స్టా టీన్ అకౌంట్స్‌ను తీసుకొచ్చింది. పిల్లల ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల నియంత్రణను పేరెంట్స్‌కు అందించింది. వీటిని ఎలా వాడాలి?

**ఏమిటీ టీన్ అకౌంట్స్?**


16 ఏళ్లలోపు పిల్లల కోసం మెటా ఈ టీన్ అకౌంట్స్‌ను తీసుకొచ్చింది. ఇవి డిఫాల్ట్‌గా ప్రైవేట్‌లో ఉంటాయి. ఈ ఖాతాలు ఉన్నవారు ఇప్పటికే ఫాలో/ కనెక్ట్ అయిన ఖాతాల నుంచి మాత్రమే సందేశాలు అందుకోగలరు. వారిని మాత్రమే ట్యాగ్ చేయగలరు. సున్నితమైన కంటెంట్‌పై పూర్తి నియంత్రణ ఉంటుంది. కొత్తగా ఫాలో అవ్వాలనుకునుకుంటే.. ఆ రిక్వెస్టులను యాక్సెప్ట్ చేయాల్సి ఉంటుంది. లేకపోతే వారి కంటెంట్‌ను చూడడం వీలుపడదు. ఫాలో అయ్యే వ్యక్తులు, కనెక్ట్ అయిన వ్యక్తుల నుంచి మాత్రమే సందేశాలు అందుకోగలరు. టీన్ ఖాతాలకు సెన్సిటివ్ కంటెంట్ కంట్రోల్ ఉంటుంది. కాబట్టి ఫీడ్‌పై నియంత్రణ లభిస్తుంది. డైరెక్ట్ మెసేజ్‌లు, కామెంట్లలో అసభ్య పదజాలాన్ని ఇన్‌స్టా ఆటోమేటిక్‌గా ఫిల్టర్ చేస్తుంది. రోజులో యాప్ వాడకం 60 నిమిషాలు దాటిన తర్వాత వారికి నోటిఫికేషన్ వస్తుంది. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు స్లీప్ మోడ్ ఆన్ అవుతుంది. ఆ సమయంలో నోటిఫికేషన్లు రావు.

**పేరెంట్స్ ఎలా కంట్రోల్ చేయాలి?**

పిల్లల ఖాతాల పర్యవేక్షణ, నియంత్రణ కోసం పేరెంట్స్ లేదా గార్డియన్ ఇద్దరికీ కచ్చితంగా ఇన్‌స్టా ఖాతా ఉండాల్సిందే. ముందుగా పేరెంట్స్ తమ ప్రొఫైల్‌కు వెళ్లి Settings and activityలో Family center ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. తర్వాత స్క్రీన్‌పై మీరు పర్యవేక్షించాలనుకుంటున్న పిల్లల అకౌంట్‌ని ఎంచుకోగానే ఆ ఖాతాకు రిక్వెస్ట్ వెళ్తుంది. దానికి ఆమోదం లభించాక ఆ ఖాతా నియంత్రణ పేరెంట్స్ చేతుల్లోకి వెళుతుంది. టైమ్ లిమిట్, స్లీప్ మోడ్ సెట్టింగ్స్‌ను మార్చొచ్చు. గత ఏడు రోజులుగా పిల్లలు ఎవరితో మాట్లాడుతున్నారనే విషయం తెలుసుకోవచ్చు. ఆ మెసేజ్‌లను చదివేందుకు మాత్రం పేరెంట్స్‌కు యాక్సెస్ ఉండదు.

**తల్లిదండ్రులు ఓకే చేస్తేనే..**

16 ఏళ్లలోపు ఉన్న యూజర్లు డిఫాల్ట్ సెట్టింగ్స్ మార్చుకోవాలన్నా, అకౌంట్‌ని ప్రైవేట్‌గా మార్చాలన్నా తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి. పిల్లలు తమ ఖాతాలోని Account Privacyపై క్లిక్ చేయగానే Private Account ఆప్షన్ ఎనేబుల్‌లో ఉన్నట్లు కనిపిస్తుంది. దాన్ని డిజేబుల్ చేసేందుకు ప్రయత్నిస్తే ఆటోమేటిక్‌గా పేరెంట్ ఖాతాను ఎంచుకోవాలని సూచిస్తుంది. అక్కడ Add Parent ఆప్షన్ ఎంచుకొని Continue పై క్లిక్ చేస్తే సదరు పేరెంట్‌కు రిక్వెస్ట్ వెళుతుంది. మీరు అనుమతిస్తేనే టీన్ అకౌంట్ పబ్లిక్‌గా మారుతుంది.




## ఐపీఎల్ ఫ్రీ బంద్.. మ్యాచ్ చూడాలంటే సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాల్సిందే!

రిలయన్స్‌కు చెందిన జియో సినిమా, డిస్నీ+ హాట్‌స్టార్‌ను ఒకే వేదిక పైకి తీసుకొచ్చాయి. దీంతో జియో హాట్‌స్టార్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇకపై జియో సినిమా, డిస్నీ+ హాట్‌స్టార్‌లోని కంటెంట్ అంతా ఒకేచోట వీక్షించొచ్చు. ఈ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ సబ్‌స్క్రిప్షన్ ప్లాన్స్ రూ.149 నుంచే ప్రారంభమవుతాయి. మొబైల్ ప్లాన్ (యాడ్ సపోర్టెడ్ ప్లాన్) ప్రారంభ ధర రూ.149. దీని వ్యాలిడిటీ 3 నెలలు. ఇక ఏడాది వ్యాలిడిటీ ప్లాన్ ధర రూ.499గా కంపెనీ నిర్ణయించింది. ఈ ప్లాన్ల ద్వారా కేవలం ఒక మొబైల్‌లో మాత్రమే కంటెంట్ చూసే సదుపాయం ఉంటుంది. రెండు డివైజ్‌లకు సపోర్ట్ చేసేలా రెండు సూపర్ ప్లాన్లను (యాడ్ సపోర్టెడ్ ప్లాన్) జియోహాట్‌స్టార్ తీసుకొచ్చింది. మూడు నెలల వ్యాలిడిటీతో అందుబాటులోకి తెచ్చిన ప్లాన్ ధర రూ.299. ఇక ఏడాది వ్యాలిడిటీ ప్లాన్ ధర రూ.899. ప్రకటనలు లేకుండా కంటెంట్ వీక్షించాలనుకొనేవారి కోసం జియోహాట్‌స్టార్ రెండు ప్రీమియం ప్లాన్లను ప్రవేశపెట్టింది. ఈ ప్లాన్ నెలకు రూ.299తో ప్రారంభమవుతుంది. మూడు నెలల ప్రీమియం ప్లాన్ ధర రూ.499. ఏడాది వ్యాలిడిటీ ప్లాన్ ధర రూ.1499. ఈ ప్రీమియం ప్లాన్లతో నాలుగు డివైజ్‌లలో కంటెంట్‌ను వీక్షించొచ్చు. ఇప్పటి వరకు ఐపీఎల్ మ్యాచ్‌లను ఉచితంగా వీక్షించిన అభిమానులకు ఆ అవకాశం పూర్తిగా లేనట్లే. హాట్‌స్టార్ + జియో కలిసి జియోహాట్‌స్టార్ పేరిట విలీనం నేపథ్యంలో ఐపీఎల్ మ్యాచ్‌లను ఉచితంగా చూడటం సాధ్యం కాదు. అందుకోసం కనీస ప్లాన్ రూ. 149తో సబ్‌స్క్రిప్షన్‌ను తీసుకోవాల్సి ఉంటుంది.

**ఒకటే యాప్**

జియో సినిమా, డిస్నీ+ హాట్‌స్టార్ కలిపి జియో హాట్‌స్టార్‌గా అవతరించింది. ప్రస్తుతం హాట్‌స్టార్ యాప్‌ను వినియోగిస్తుంటే.. యాప్ అప్‌డేట్ తర్వాత అది జియో హాట్‌స్టార్‌గా మారుతుంది. అలాగే, జియో సినిమా యాప్‌నకు వెళితే అక్కడి నుంచి జియో హాట్‌స్టార్ యాప్‌కు రీడైరెక్ట్ అవుతుంది. ఒకవేళ ఇప్పటికే హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్ తీసుకుని ఉంటే రాబోయే 3 నెలల పాటు వారికి పాత రేట్లే కొనసాగుతాయి. ఒకవేళ జియో సినిమా ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ తీసుకుని ఉంటే వారు ఆటోమేటిక్‌గా జియోహాట్‌స్టార్ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌కు మారుతారు.

## వచ్చే వారమే ఐఫోన్ ఎస్‌ఈ 4.. ధ్రువీకరించిన టిమ్ కుక్!

ఐఫోన్ ఎస్‌ఈ సిరీస్‌లో నాలుగోతరం మొబైల్ కోసం టెక్ ప్రియులు చాలాకాలంగా ఎదురుచూస్తున్నారు. రెగ్యులర్ మోడళ్ల కంటే అందుబాటులో ధర ఉండడమే దీనికి కారణం. అయితే త్వరలోనే యాపిల్ నుంచి కొత్త ప్రొడెక్ట్ మార్కెట్లోకి లాంచ్ అవ్వడానికి సిద్ధమవుతోంది. ఈవిషయాన్ని యాపిల్ సీఈఓ టిమ్ కుక్ 'ఎక్స్' వేదికగా స్వయంగా వెల్లడించారు. ఫిబ్రవరి 19న యాపిల్ నుంచి ఎస్4 మార్కెట్లోకి ఎంట్రీ ఇవ్వనున్నట్లు టిమ్ కుక్ తెలిపారు. వెండి వర్ణంలో మెరిసిపోతున్న యాపిల్ లోగోను షేర్ చేశారు. ఏ ప్రోడక్ట్‌ను తీసుకురానున్నారనే విషయాన్ని మాత్రం వెల్లడించనప్పటికీ.. యాపిల్ తన నాలుగోతరం ఎస్‌ఈ మోడల్‌ను తీసుకురానున్నట్లు మార్కెట్లో చాలాకాలంగా రూమర్స్ ఉన్నాయి. 'మా ఫ్యామిలీలోకి మరో కొత్త మెంబర్ రాబోతున్నారు' అని ఆయన పేర్కొనడం బట్టి ఎస్4 అయి ఉంటుందని టెక్ వర్గాలు చెబుతున్నాయి.

**ఈ ఫీచర్లతో యాపిల్ ఎస్‌ఈ4**

యాపిల్ ఐఫోన్లలో ఎస్‌ఈ సిరీస్‌లకు సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. 2022లో చివరగా యాపిల్ తన ఎస్‌ఈ మొబైల్‌ను తీసుకొచ్చింది. దాదాపు మూడేళ్ల తర్వాత ఎస్‌ఈ సిరీస్‌లో కొత్త ఫోన్ వస్తుండడం విశేషం. ఐఫోన్14 తరహాలోనే హోమ్ బటన్, టచ్ ఐడీ లేకుండా.. ఫేస్ ఐడీ ఫీచర్‌తో ఈ ఫోన్‌ను తీసుకొచ్చే అవకాశం ఉందని టెక్ నిపుణులు అంచనా వేస్తున్నారు. యాపిల్ ఇంటెలిజెన్స్, యూఎస్‌బీ టైప్ సి పోర్ట్, ఏ18 చిప్‌సెట్‌తో వచ్చే అవకాశం ఉంది. బేస్ వేరియంట్ ధర రూ.43,900గా ఉండే అవకాశం ఉంది.






## 4 ఆండ్రాయిడ్ అప్‌డేట్స్‌తో ₹10 వేల్లోపే శాంసంగ్ 5జీ ఫోన్!

ప్రముఖ ఎలక్ట్రానిక్స్ సంస్థ శాంసంగ్ భారత్‌లో తక్కువ ధరలో 5జీ ఫోన్‌ను అందుబాటులోకి తెచ్చింది. శాంసంగ్ గెలాక్సీ ఎఫ్ 06 పేరిట దీన్ని విడుదల చేసింది. దీన్ని రూ.10వేల్లోపే తీసుకురావడం గమనార్హం. నాలుగు ఆండ్రాయిడ్ అప్‌డేట్స్, నాలుగేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్‌తో ఈ ఫోన్ విడుదల చేస్తుండడం విశేషం. ఈ ఫోన్‌లో 6.7 అంగుళాల హెచ్‌డీ+ డిస్‌ప్లే ఇచ్చారు. ఇది 90Hz రిఫ్రెష్ రేటుకు సపోర్ట్ చేస్తుంది. మీడియాటెక్ డైమెన్‌సిటీ 6300 ప్రాసెసర్‌తో పనిచేస్తుంది. వెనుకవైపు 50 ఎంపీ కెమెరా, 2 ఎంపీ డెప్త్ సెన్సర్ ఇచ్చారు. సెల్ఫీల కోసం 8 ఎంపీ కెమెరా ఇచ్చారు. 5000 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. 25W ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. బహామా బ్లూ, లిట్ వయలెట్ రంగుల్లో లభిస్తుంది. ఈ ఫోన్ రిపిల్ గ్లో ఫినిష్‌తో వస్తోంది. ఫోన్‌పై లైట్ పడినప్పుడు అది మెరుస్తుంది. సైడ్ మౌంటెడ్ ఫింగర్‌ప్రింట్ సెన్సర్‌తో వస్తోంది. ఇందులో శాంసంగ్ వాయిస్ ఫోకస్ ఫీచర్ ఉంది. తద్వారా కాల్స్ మాట్లాడేటప్పుడు బయటి శబ్దాలను నిరోధిస్తుంది. మొత్తం 12 5జీ బ్యాండ్లకు ఈ ఫోన్ సపోర్ట్ చేస్తుందని కంపెనీ తెలిపింది. రెండు వేరియంట్లలో ఈ ఫోన్ లభిస్తుంది. 4జీబీ+128జీబీ ధర రూ.9,999 కాగా, 6జీబీ+128 జీబీ ధర రూ.10,999గా కంపెనీ నిర్ణయించింది. రూ.500 ఇన్‌స్టంట్ బ్యాంక్ క్యాష్‌బ్యాక్ ప్రకటించింది. శాంసంగ్ వెబ్‌సైట్, ఫ్లిప్‌కార్ట్‌తో పాటు ఎంపిక చేసిన రిటైల్ స్టోర్‌లలో ఈ నెల 20 నుంచి విక్రయాలు జరగనున్నాయి.





## 'భూమిపైనే అత్యంత తెలివైన ఏఐ'.. గ్రోక్3 లాంచ్‌పై మస్క్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై కీలక ప్రకటనతో బిలియనీర్ ఎలాన్ మస్క్ మరోసారి ప్రపంచ దృష్టిని ఆకర్షించారు. తాజాగా గ్రోక్ 3 సేవల్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన తెలిపారు. ఈ మోడల్‌ను భూమిపైన అత్యంత తెలివైన ఏఐ సాధనంగా అభివర్ణించారు. భారత కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 9:30 గంటలకు ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. మస్క్ నేతృత్వంలోని కృత్రిమ మేధ సంస్థ 'ఎక్స్‌ఏఐ' సిద్ధం చేసిన గ్రోక్ చాట్‌బాట్ సేవలు ఇప్పటికే బాగా ప్రాచుర్యం పొందాయి. చాట్‌జీపీటీకి పోటీగా వచ్చిన ఇది మెరుగైన సేవల్ని అందిస్తోంది. తాజాగా 'ఎక్స్' వేదికగా గ్రోక్3ని తీసుకొస్తున్నట్లు మస్క్ ప్రకటించారు. అయితే.. దీని సామర్థ్యాలకు సంబంధించిన పూర్తి వివరాల్ని మాత్రం వెల్లడించలేదు. ఈ ఏఐ మోడల్ టెక్స్ టు వీడియో వంటి అధునాతన ఫీచర్లను కలిగి ఉంటుందని టెక్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఒక వేళ ఈ ఫీచర్లతో వస్తే ఓపెన్‌ఏఐ తీసుకొచ్చిన జీపీటీ 4 (GPT4), గూగుల్ జెమిని వంటి మోడళ్లకు ప్రధాన పోటీదారుగా నిలవనుంది. కృత్రిమ మేధ విభాగంలో పోటీ తీవ్రంగా మారింది. ఓవైపు ఓపెన్‌ఏఐ తన చాట్‌జీపీటీ మోడళ్లను నిరంతరం మెరుగుపరుస్తూనే ఉంది. గూగుల్ కూడా జెమినీని తీర్చిదిద్దుతోంది. మెటా దాని LLaMA సిరీస్‌ను విస్తరిస్తోంది. ఈ టెక్ దిగ్గజాలన్ని ఇప్పటికే ఏఐ అభివృద్ధిలో దూసుకెళ్తున్నాయి. ఈ నేపథ్యంలో గ్రోక్ 3ని తీసుకురావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఏఐ ఏజెంట్లే సేవలందిస్తాయ్

### కృత్రిమ మేధ, జనరేటివ్ ఏఐ టెక్నాలజీతో సాకారం
### 2030 నాటికి అనూహ్య మార్పులు
### దేశీయ ఐటీ కంపెనీలకు మేలు
### పాత తరహా ఉద్యోగాలు పోయి కొత్త ఉద్యోగాలొస్తాయ్




మాట్లాడతాయి సలహాలు ఇస్తాయి.. ఇమెయిల్స్ రాస్తాయి టిక్కెట్లు బుక్ చేస్తాయి, సందర్శకులతో మాటామాటా కలుపుతాయి.. అన్నీ యంత్రాలే. చూడటానికి కంప్యూటర్లు, రోబోలు, మొబైల్ యాప్‌లు, వెబ్‌సైట్లు, కియోస్క్‌ల రూపంలో ఉంటాయి. కార్యాలయాలు, రైల్వేస్టేషన్, బస్టాండు, విమానాశ్రయం, హోటల్, ఆసుపత్రి.. ఇలా ఎక్కడైనా మనుషులు అందిస్తున్న కొన్ని సేవలను, 'ఏఐ ఏజెంట్లు'గా పిలిచే సరికొత్త ఏఐ యంత్రాలే చేసే రోజులు దగ్గర కొస్తున్నాయి. ఏఐ (కృత్రిమ మేధ), జనరేటివ్ ఏఐ (జెన్ ఏఐ) సాంకేతికత కారణంగా ఈ ఏజెంట్లు, మనుషుల మాదిరిగా ఆలోచించి నిర్ణయాలు కూడా తీసుకుంటాయట. 2030 నాటికి ఇటువంటి నూతన ప్రపంచాన్ని చూస్తామని సాంకేతిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

**హైదరాబాద్, బెంగళూరు సై**

ఏఐ ఏజెంట్ల వల్ల ఆర్థిక కార్యకలాపాలు బాగా పెరుగుతాయి. సేవల నాణ్యత, వేగం విస్తరిస్తాయి. నూతన సాంకేతిక పరిజ్ఞానం గల వారికి ఉద్యోగాలు లభిస్తాయి. అదే సమయంలో కొన్ని కిందిస్థాయి ఉద్యోగాలు మనుగడలో ఉండవు. ఈ సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధిలో బెంగళూరు, హైదరాబాద్ నగరాలు కేంద్ర స్థానంగా ఎదుగుతుండటం అత్యంత ఆసక్తికర విషయం. ఈ నగరాల్లో దేశీయ కంపెనీలు, బహుళ జాతి ఐటీ కంపెనీలు ఏఐ, జెన్ ఏఐ టెక్నాలజీపై పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతున్నాయి.

**200 బిలియన్ డాలర్ల బడ్జెట్**

అంతర్జాతీయంగా ఏఐ, జెన్ ఏఐ టెక్నాలజీపై వ్యాపార సంస్థలు వెచ్చించే మొత్తం 40 బిలియన్ డాలర్లుగా ఉంది. 2030 నాటికి ఈ మొత్తం 200 బిలియన్ డాలర్లకు పెరుగుతుందన్నది అంచనా. ఫలితంగా మనదేశంలో ఏఐ, జెన్ ఏఐ టెక్నాలజీ ఆధారిత సేవలు అందించే ఐటీ కంపెనీలకు పెద్దఎత్తున ప్రాజెక్టులు లభిస్తాయి. ఇందువల్ల ఉద్యోగాలూ పెరుగుతాయి. ఈ కొత్త అవకాశాలను మనదేశంలో పెద్ద ఐటీ కంపెనీలైన టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో అందిపుచ్చుకునే అవకాశం ఉంది.

**జీడీపీకి అదనంగా 1.2- 1.5 ట్రిలియన్ డాలర్లు**

ఏఐ టెక్నాలజీతో 2030 నాటికి మనదేశ జీడీపీ అదనంగా 1.21.5 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.105131 లక్షల కోట్లు) మేర పెరగొచ్చని ఎర్నెస్ట్ అండ్ యంగ్ ఇటీవలి నివేదికలో స్పష్టం చేసింది. వ్యాపార సేవలు, ఫైనాన్స్, విద్య, రిటెయిల్, హెల్త్‌కేర్ రంగాలు ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో లబ్దిపొందుతాయని విశ్లేషించింది. ఇందుకోసం వ్యాపార సంస్థలు సన్నద్ధమవ్వాలని.. నైపుణ్యాల కొరతా ఉన్నట్లు వివరించింది.

**27 లక్షల కొత్త ఉద్యోగాలకు వీలు**

టెలి కాలర్లు, రిసెప్షనిస్టులు, గైడ్‌ల వంటి కింది స్థాయి ఉద్యోగాలకు ఏఐ, జెన్ ఏఐ టెక్నాలజీలతో ముప్పు రావొచ్చు. అయితే జెన్ ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ వల్ల 2030 నాటికి మనదేశంలో 27 లక్షల కొత్త ఉద్యోగాలు ఆయా నైపుణ్యాలున్న వారికి లభిస్తాయి. విద్యార్థులు, ఉద్యోగార్థులు దీనికి ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలి. ఈ ఉద్యోగాలు బెంగళూరు, పుణె, హైదరాబాద్‌లలో అధికంగా ఉంటాయని తెలుస్తోంది.

**ఆ మార్పు ఎంతో దూరంలో లేదు**

2029 నాటికి కృత్రిమ మేధ (ఏఐ) వల్ల మనిషి ఆలోచనలకు, ఏఐ ఆధారిత యంత్రానికి పెద్ద తేడా ఉండదు. అన్ని రంగాలను, వ్యాపార కార్యకలాపాలను, సమాజాన్ని, మన జీవన విధానాన్ని ఈ సాంకేతిక పరిజ్ఞానం ప్రభావితం చేస్తుంది. ఊహకు అందని మార్పులొస్తాయి. గేమింగ్, యానిమేషన్, హెల్త్‌కేర్, బ్యాంకింగ్, రవాణా, రక్షణ, కంటెంట్ క్రియేషన్, డేటా మైనింగ్ విభాగాల్లో ఏఐ తెచ్చే మార్పులు అనూహ్యం. సాధారణ ఉద్యోగాలు తగ్గి, నైపుణ్యం, అధిక జీతభత్యాలు ఉన్న ఉద్యోగాలు లభిస్తాయి.

**పది మంది పనికి ఒక యంత్రమే**

కొవిడ్19 తర్వాత డిజిటలీకరణ విస్తరిస్తోంది. సమీప భవిష్యత్తులో ప్రతి పనిలో ఏఐ కనిపిస్తుంది. ఇప్పుడు పది మంది చేసే పనిని ఒకే యంత్రం చేయగలుగుతుంది. ఆ యంత్రాన్ని నిర్వహించే సత్తా ఉన్న వ్యక్తికి ఉద్యోగం లభిస్తుంది. సాఫ్ట్‌వేర్ విభాగంలో సరికొత్త ఉద్యోగాలు, అవకాశాలు ఏర్పడతాయి. హార్డ్‌వేర్‌లోనూ ఆవిష్కరణ, ఉత్పత్తి, పంపిణీ అవకాశాలు ఉంటాయి.

# ఫిక్స్‌డ్ ప్లేస్‌లు ఉండవ్.. ఆ కాంబినేషన్ వైపే గంభీర్ మొగ్గు!



ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ కోసం టీమ్ఇండియా ఇప్పటికే దుబాయ్‌కు చేరుకుంది. ఎనిమిదేళ్ల తర్వాత జరగనున్న టోర్నీ కావడంతో ప్రతి జట్టూ ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. భారత్ కూడా బలమైన టీమ్‌నే ఎంపిక చేసినట్లు క్రికెట్ వర్గాలు విశ్లేషించాయి. అయితే, మిడిలార్డర్‌పై బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ మధ్య తీవ్ర స్థాయిలో చర్చ జరిగినట్లు వార్తలు వస్తున్నాయి. గంభీర్ మాత్రం కుడిఎడమ కాంబినేషన్‌లోనే వెళ్లాలనే ఉద్దేశంతోనే ఉన్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా బ్యాటింగ్ లైనప్‌లో ఫిక్స్‌డ్ స్థానాలంటూ ఏమీ ఉండవని.. పరిస్థితికి తగ్గట్టుగా మార్పులు చేసుకుంటూ ఆడాలని గంభీర్ పట్టుదలతో ఉన్నాడు.

**శ్రేయస్‌ను తీసుకోవడంపైనా..**

ఇంగ్లండ్‌తో తొలి వన్డేలో విరాట్ కోహ్లీ ఆడలేదు. అతడికి బదులు అవకాశం దక్కించుకున్న శ్రేయస్ అయ్యర్ అద్భుతంగా రాణించాడు. ఆ మ్యాచ్‌లో దూకుడైన హాఫ్ సెంచరీ సాధించాడు. దీంతో అతడిని పక్కన పెట్టేందుకు అవకాశం లేకుండా పోయింది. మిడిలార్డర్‌లో అయ్యర్ కీలకంగా మారతాడని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. అతడికి తోడుగా అక్షర్ పటేల్‌ను ముందుకు తీసుకొచ్చింది. కుడిఎడమ కాంబినేషన్‌తో బరిలోకి దిగితే ప్రత్యర్థికి ఇబ్బందికరమని గంభీర్ ఆలోచన. అందుకు తగినట్టే అక్షర్‌ను ఐదో ప్లేస్‌కు తీసుకొచ్చి.. కేఎల్ రాహుల్‌ను ఆరో స్థానంలో పంపించాడు. కానీ, జట్టుకు ప్రయోజనంగా మారినా.. వ్యక్తిగతంగా కేఎల్ ప్రదర్శనపై తీవ్ర ప్రభావం పడింది. దీంతో చివరి వన్డేలో మళ్లీ రాహుల్‌ను ఐదో స్థానంలోనే ఆడించాల్సి వచ్చింది. ఛాంపియన్స్ ట్రోఫీలో మాత్రం అక్షర్‌నే ఆడించడం ఖాయంగా కనిపిస్తోంది. గంభీర్ ఆ విషయంలో పట్టుదలతో ఉన్నట్లు క్రికెట్ వర్గాలు తెలిపాయి.

**వికెట్ కీపర్ అంశంలోనూ..**

ఛాంపియన్స్ ట్రోఫీలో అందరూ రిషభ్ పంత్ తొలి ప్రాధాన్య వికెట్ కీపర్‌గా భావించారు. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ కూడా స్క్వాడ్‌ను ప్రకటించినప్పుడు పంత్ పేరునే ప్రస్తావించింది. కానీ, గంభీర్ మాత్రం కేఎల్ రాహుల్ వైపు మొగ్గు చూపాడు. ఈ విషయంలోనూ గంభీర్, అగార్కర్ మధ్య తీవ్ర స్థాయిలో చర్చలు జరిగినట్లు వార్తలు వస్తున్నాయి. అందుకు తగినట్లుగానే ఇంగ్లండ్‌తో మూడు వన్డేల్లోనూ కేఎల్ రాహుల్‌కే కీపింగ్ బాధ్యతలు అప్పగించారు. రిషభ్ పంత్ బెంచ్‌కే పరిమితమయ్యాడు. దుబాయ్‌కు బయల్దేరే ముందు జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లోనూ గంభీర్ దీనిపై స్పష్టత ఇచ్చాడు. కేఎల్ రాహుల్ నంబర్‌వన్ వికెట్ కీపర్.. ఒకే మ్యాచ్‌లో ఇద్దరు కీపర్లతో బరిలోకి దిగడం కష్టమేనని వ్యాఖ్యానించాడు. అయితే, ఎప్పుడు పంత్‌కు అవకాశం వచ్చినా ఆడేందుకు సిద్ధంగా ఉంటాడని గంభీర్ తెలిపాడు.



## ఛాంపియన్స్ ట్రోఫీ 2025.. భారత్ మ్యాచ్‌లకు అదనపు టికెట్లు

ఛాంపియన్స్ ట్రోఫీలో భారత మ్యాచ్‌లను వీక్షించాలనుకొనే అభిమానులకు ఐసీసీ గుడ్‌న్యూస్ చెప్పింది. అదనంగా టికెట్లను జారీ చేస్తూ నిర్ణయం తీసుకుంది. మధ్యాహ్నం నుంచే టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచింది. ఇక ఫైనల్ మ్యాచ్‌కు టికెట్లను తొలి సెమీస్ ముగిశాక విడుదల చేసే అవకాశం ఉంది. టీమ్ఇండియా ఫైనల్‌కు చేరితే దుబాయ్ వేదికగానే ఆ మ్యాచ్ జరగనుంది. దీంతో వేదిక ఖరారు కావాలంటే మొదటి సెమీస్ ఫలితం రావాలి. గ్రూప్ స్టేజ్‌లో భారత్ తన తొలి మ్యాచ్‌ను బంగ్లాదేశ్‌తో ఫిబ్రవరి 20న తలపడనుంది. ఫిబ్రవరి 23న పాక్‌తో, మార్చి 2న న్యూజిలాండ్‌తో భారత్ ఆడనుంది. మార్చి 4న తొలి సెమీస్ జరగనుంది. "భారత్ ఆడే తొలి మ్యాచ్‌ను చూసేందుకు ఇప్పటికే టికెట్లను అందుబాటులో ఉంచాం. పాక్, న్యూజిలాండ్‌తో పోరును వీక్షించాలనుకొనే అభిమానులకూ టికెట్లు సిద్ధంగా ఉన్నాయి. అదనంగా మరికొన్ని టికెట్లను అందుబాటులోకి తీసుకొచ్చాం. ఇక సెమీస్‌కూ పరిమితమైన టికెట్లు ఉన్నాయి. ఫైనల్ మ్యాచ్ కోసం టికెట్లను ఇంకా విడుదల చేయలేదు. అదంతా భారత్ మీదే ఆధారపడి ఉంది. టీమ్ఇండియా సెమీస్‌కు చేరి.. అక్కడ విజయం సాధించి ఫైనల్‌కు వస్తే దుబాయ్ ఆతిథ్యం ఇవ్వనుంది. లేకపోతే లాహోర్‌లోనే టైటిల్ పోరు ఉంటుంది" అని ఐసీసీ వెల్లడించింది. భారత్ పాక్ మ్యాచ్‌కు కేటాయించిన అదనపు టికెట్లు త్వరగానే సేల్ అయిపోవడం గమనార్హం. ఛాంపియన్స్ ట్రోఫీ గ్రూప్ Aలో భారత్, పాకిస్థాన్, న్యూజిలాండ్, బంగ్లాదేశ ఉన్నాయి. పాకిస్థాన్ ఆతిథ్యాన టోర్నీ జరగనుంది. తొలి మ్యాచ్ పాక్ న్యూజిలాండ్ జట్ల మధ్య ఫిబ్రవరి 19తో ట్రోఫీ ప్రారంభం కానుంది.



## యశస్వి జైస్వాల్‌కు గాయం? ఆ ప్లేస్‌లోకి ఎవరొస్తారో?

రంజీ ట్రోఫీ సెమీస్ మ్యాచ్‌లు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. గుజరాత్ కేరళ, విదర్భ ముంబయి మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం నాన్ ట్రావెల్ రిజర్వ్‌లో ఉన్న భారత యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ కూడా రంజీ సెమీస్‌లో దిగుతాడని తొలుత వార్తలు వచ్చాయి. తాజాగా అతడికి చీలమండ గాయం తలెత్తడంతో సెమీస్‌లో ఆడటం లేదని ముంబయి మేనేజ్‌మెంట్ వర్గాలు వెల్లడించాయి. "రంజీ సెమీఫైనల్ మ్యాచ్ నుంచి జైస్వాల్ వైదొలిగాడు. ఎడమ చీలమండలో నొప్పితో బాధపడుతున్నాడు. నాగ్‌పుర్‌లో ముంబయి ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నాడు. కానీ, సౌకర్యంగా అనిపించలేదు. బ్యాటింగ్ చేస్తూ ఇబ్బంది పడ్డాడు. పాత గాయం తిరగబెట్టినట్లుంది. సోమవారం సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్‌కు వెళ్తాడు. అక్కడే అతడి రికవరీ ప్రాసెస్ ప్రారంభం కానుంది" అని పేర్కొన్నాయి.

**మరొకరిని ఎంపిక చేస్తారా?**

ఇప్పుడు అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీకి మరో తలనొప్పి ఎదురైంది. ఒకవేళ యశస్వి జైస్వాల్ పూర్తిగా దూరమైతే మాత్రం.. అతడి ప్లేస్‌లో రిజర్వ్‌గా ఇంకో ఆటగాడిని ఎంపిక చేయాల్సి ఉంది. తొలుత ప్రధాన స్క్వాడ్‌లోనే అవకాశం లభించినప్పటికీ.. వరుణ్ చక్రవర్తిని తీసుకొనేందుకు యశస్విని నాన్ ట్రావెల్ రిజర్వ్‌గా పక్కన పెట్టారు. ఇప్పుడు మరొకరిని తీసుకుంటారా? లేదా? అనేది తెలియాల్సి ఉంది. మరోవైపు ముంబయి క్రికెట్ జట్టు మాత్రం యశస్వికి బదులు ఇంకా ఎవరినీ తీసుకోలేదు. రంజీ ట్రోఫీలో యశస్విని తొలుత 18వ ఆటగాడిగా ఎంపిక చేశారు. అతడు గాయం కారణంగా వైదొలగినప్పటికీ రిప్లేస్ చేయలేదు. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ సమయంలో మణికట్టుకు గాయమైంది. అయితే, అతడు ఫిట్‌నెస్ సాధించి సెమీస్‌కు సిద్ధమైనట్లు ముంబయి వర్గాలు తెలిపాయి.

## భారత్‌ను ఓడించడమా? ట్రోఫీని నెగ్గడమా?.. పాక్ వైస్ కెప్టెన్ స్పందనిదే




ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో క్రికెట్ అభిమానులు ఎదురు చూసే మ్యాచ్ భారత్‌పాకిస్థాన్ పోరు. ఫిబ్రవరి 23న దుబాయ్ వేదికగా ఇది జరగనుంది. ఇప్పటికే పాక్ అభిమానులు తమ జట్టుకు పెద్ద ఎత్తున సందేశాలు పంపిస్తున్నారు. భారత ఆటగాళ్లను హగ్ కూడా చేసుకోకూడదని చెబుతున్నారు. ఇరు దేశాల క్రికెట్ అభిమానులకూ ఇది భావోద్వేగపూరిత మ్యాచ్ అనడంలో సందేహం లేదు. ఈ క్రమంలో పాకిస్థాన్ వైస్ కెప్టెన్ అఘా సల్మాన్ ముందు ఓ ప్రశ్న ఎదురైంది. ఇంతకీ అతడు ఏం చెప్పాడంటే? "పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తోన్న ఛాంపియన్స్ ట్రోఫీ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. ఈ ఐసీసీ ఈవెంట్‌ను నిర్వహించడం మాకెంతో స్పెషల్. లాహోర్‌లో టైటిల్‌ను అందుకోవాలనేది మా లక్ష్యం. ఆ కల నెరవేరుతుందని భావిస్తున్నా. విజేతగా నిలిచే సత్తా మాకుంది. ఇక భారత్‌తో మ్యాచ్ అంటేనే ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. ఇతర మ్యాచ్‌లతో పోలిస్తే కాస్త భిన్నమైందే. అభిమానులు మాత్రం ఇదే అతిపెద్ద పోరు అని చెబుతారు. క్రికెటర్‌గా మాత్రం ఇతర మ్యాచ్‌లాంటిదేనని అంటాను. ఒక దానిలో విజయం సాధించడం కంటే ఛాంపియన్స్ ట్రోఫీని గెలవడమే మాకు అత్యంత ముఖ్యం. అయితే, మేమంతా భారత్‌పై విజయం సాధించాలని కోరుకుంటున్నాం. అందు కోసం తుది వరకూ ప్రయత్నిస్తాం. అత్యుత్తమ ప్రదర్శన చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తా" అని సల్మాన్ వ్యాఖ్యానించాడు.

## రాణా మెరుపులు మెరిపిస్తాడా?



గత సంవత్సరం టి20 ప్రపంచ కప్‌లో విజయం తర్వాత రోహిత్ శర్మ నాయకత్వంలోని భారత జట్టు పెద్దగా చెప్పుకోదగ్గ విజయాలు సాధించలేదు. ఈ నేపథ్యంలో దుబాయ్, పాకిస్తాన్‌లలో ప్రారంభం కానున్న ఛాంపియన్స్ ట్రోఫీపై భారత్ గురి పెట్టింది. తమ తొలి మ్యాచ్‌లో భారత్ ఈ నెల 20వ తేదీన బంగ్లాదేశ్‌తో తలపడుతుంది. ఆ తర్వాత ఫిబ్రవరి 23న చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో పెద్ద సవాలును ఎదుర్కోబోతోంది. ఈ టోర్నమెంట్ కోసం భారత క్రీడాకారులు ఇప్పటికే దుబాయ్ చేరుకున్నారు. భారత్ జట్టు ఎంపికపై పెద్దగా వివాదం లేకపోయినా, జట్టులోని ప్రధాన ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా వెన్ను నొప్పితో టోర్నమెంట్ కి దూరం కావడంతో అతని స్తానం లో జట్టులోకి వచ్చిన ఢిల్లీ పేసర్ హర్షిత్ రాణాపైనే ఆసక్తి రేకెత్తుతోంది.

**సిరాజ్‌ను మినహాయించడం ఆశ్చర్యకరం**

సిరాజ్‌ను జట్టు నుంచి మినహాయించడం చాలా ఆశ్చర్యకరం కలిగించింది. సిరాజ్ ఇటీవల ఆస్ట్రేలియా పర్యటనలో జట్టు మేనేజిమెంట్ ఆశించిన స్థాయిలో రాణించకపోయినప్పటికీ, మరీ దారుణంగా విఫలం కాలేదు. పైగా రాణాతో పోలిస్తే సిరాజ్ చాలా అనుభవం గడించాడు. సిరాజ్ ఇప్పటివరకు 44 వన్డేలు ఆడాడు. 24.04 సగటు తో 5.18 ఎకానమీతో 71 వికెట్లు పడగొట్టాడు. సిరాజ్ దాదాపు 2022 ప్రారంభం నుండి 2024 చివరి వరకు భారత్ తరఫున వన్డేల్లో అత్యధిక వన్డే వికెట్లు తీసిన బౌలర్‌గా ఖ్యాతి గడించాడు. ఈ నేపథ్యంలో జట్టు మేనేజిమెంట్ కి సిరాజ్ స్థానంలో రాణా ఎందుకు మెరుగ్గా కనిపించాడు..? ఛాంపియన్స్ ట్రోఫీ కోసం తాత్కాలిక జట్టుని ప్రకటించిన సందర్భంగా కెప్టెన్ రోహిత్ శర్మ మాట్లాడుతూ .."సిరాజ్ ఆడకపోవడం దురదృష్టకరమని అన్నాడు. బుమ్రా లేకపోవడంతో డెత్‌బౌలింగ్ నైపుణ్యం ఉన్న ఎడమచేతి వాటం బౌలర్ అర్షదీప్ సింగ్ అవకాశం కల్పించామని తెలిపాడు. షమీ ఫిట్‌నెస్ సాధించడంతో సిరాజ్ కి చోటు కల్పించలేక పోయామని చెప్పాడు. అయితే సిరాజ్ డెత్ బౌలింగ్ సరిగ్గా చేయలేకపోయిన కారణంగానే జట్టుకి దూరమయ్యాడనేది వాస్తవం.

**ఇంగ్లాండ్ సిరీస్‌లో రాణించిన రాణా**

ఇక రాణా విషయానికొస్తే, ఇంగ్లాండ్ సిరీస్‌కు ముందు రోహిత్ ఈ విషయం పై స్పష్టత ఇచ్చాడు. "బుమ్రా లేని కారణంగా జట్టు ఫాస్ట్ బౌలింగ్ కి కొత్తదనం కావాలి. రాణాలో మాకు ఆ సామర్థ్యం కనిపించింది. ఇంగ్లాండ్ సిరీస్ మొదటి మ్యాచ్‌లో రాణా తన తొలి ఓవర్లో 11 పరుగులు ఇచ్చాడు. రెండవ ఓవర్ మెయిడెన్ వేసిన తర్వాత మూడవ ఓవర్‌లో ఫిల్ సాల్ట్ ఏకంగా 26 పరుగులు సాధించాడు. అయితే సాల్ట్ అవుటైన తర్వాత మళ్ళీ బౌలింగ్ కి వచ్చిన రాణా వెంటనే తన 6'2" అడుగుల ఎత్తుని అనువుగా ఉపయోగించుకొని ప్రతి దాడి చేసాడు. 140kph కంటే ఎక్కువ వేగంతో బౌలింగ్ చేసి తన ప్రభావం చూపడం ప్రారంభించాడు. బెన్ డకెట్‌ను అవుట్ చేసి వన్డేల్లో తన తొలి వికెట్‌ను నమోదు చేసుకున్నాడు. 22 ఏళ్ల వయసులో ఉన్న రాణా తన నైపుణ్యానికి ఇంకా మెరుగులు దిద్దు కుంటున్నాడు. పేస్ బౌలర్ గా రాణించడానికి తన శాయశక్తులా ప్రయత్నిస్తున్నాడు. ఇంగ్లాండ్ తో జరిగిన సిరీస్ లో రాణా చెప్పుకోదగ్గ రీతిలో రాణించాడు. అయితే ఛాంపియన్స్ ట్రోఫీ టోర్నమెంట్ లో ఎలా రాణిస్తాడన్నదాని పైనే జట్టులో రాణాని కొనసాగించడం ఆధారపడి ఉంటుంది.

# ఐపీఎల్ 2025.. 65 రోజుల్లో 74 మ్యాచులు...

## ఐపీఎల్ 18వ సీజన్ షెడ్యూల్‌ను కమిటీ ప్రకటించింది. దాదాపు రెండు నెలలపాటు ఐపీఎల్ మ్యాచ్‌లు సందడి చేయనున్నాయి.



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (IPL 2025) 18వ ఎడిషన్ పూర్తిస్థాయి షెడ్యూల్ వచ్చేసింది. మార్చి 22 నుంచి మే 25 వరకు ఐపీఎల్ 2025 సీజన్ అలరించనుంది. మొత్తం 74 మ్యాచులు 65 రోజులపాటు జరుగుతాయి. తొలి మ్యాచ్ మార్చి 22న డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య ఈడెన్ గార్డెన్స్ వేదికగా ప్రారంభం కానుంది. మార్చి 23న ఉప్పల్ వేదికగా హైదరాబాద్ రాజస్థాన్ జట్ల మధ్య పోరు ఉండనుంది. విశాఖలోని అంతర్జాతీయ క్రికెట్ మైదానానికి రెండు మ్యాచ్‌లను కేటాయిస్తూ ఐపీఎల్ కమిటీ నిర్ణయం తీసుకుంది. మార్చి 24న దిల్లీ లఖ్‌నవూ, మార్చి 30న దిల్లీ హైదరాబాద్ జట్ల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి.

**సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌లు**

రాజస్థాన్‌తో మార్చి 23
లఖ్‌నవూతో మార్చి 27, మే 18
దిల్లీతో మార్చి 30, మే 5
కోల్‌కతాతో ఏప్రిల్ 3, మే 10
గుజరాత్‌తో ఏప్రిల్ 6, మే 2
పంజాబ్‌తో ఏప్రిల్ 12
ముంబయితో ఏప్రిల్ 17, ఏప్రిల్ 23
చెన్నైతో ఏప్రిల్ 25
బెంగళూరుతో మే 13

**చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్‌లు**

ముంబయితో మార్చి 23, ఏప్రిల్ 20
బెంగళూరుతో మార్చి 28, మే 3
రాజస్థాన్‌తో మార్చి 30, మే 12
దిల్లీతో ఏప్రిల్ 5
పంజాబ్‌తో ఏప్రిల్ 8, ఏప్రిల్ 30
లఖ్‌నవూతో ఏప్రిల్ 14
హైదరాబాద్‌తో ఏప్రిల్ 25
కోల్‌కతాతో ఏప్రిల్ 11, మే 7
గుజరాత్‌తో మే 18

**ముంబయి ఇండియన్స్ మ్యాచ్‌లు..**

చెన్నైతో మార్చి 23, ఏప్రిల్ 20
గుజరాత్‌తో మార్చి29, మే 6
కోల్‌కతాతో మార్చి 31
లఖ్‌నవూతో ఏప్రిల్ 4, ఏప్రిల్ 27
బెంగళూరుతో ఏప్రిల్ 7
దిల్లీతో ఏప్రిల్ 13, మే 15
హైదరాబాద్‌తో ఏప్రిల్ 17, ఏప్రిల్ 23
రాజస్థాన్‌తో మే 1
పంజాబ్‌తో మే 11

**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మ్యాచ్‌లు**

కోల్‌కతాతో మార్చి22, మే 17
చెన్నైతో మార్చి 28, మే 3
గుజరాత్‌తో ఏప్రిల్ 2
ముంబయితో ఏప్రిల్ 7
దిల్లీతో ఏప్రిల్ 10, ఏప్రిల్ 27
పంజాబ్‌తో ఏప్రిల్ 18, ఏప్రిల్ 20
రాజస్థాన్‌తో ఏప్రిల్ 13, ఏప్రిల్ 24
లఖ్‌నవూతో మే 9
హైదరాబాద్‌తో మే 13

**కోల్‌కతా నైట్‌రైడర్స్ మ్యాచ్‌లు**

బెంగళూరుతో మార్చి 22, మే 17
రాజస్థాన్‌తో మార్చి 26, మే 4
ముంబయితో మార్చి 31
హైదరాబాద్‌తో ఏప్రిల్ 3, మే 10
లఖ్‌నవూతో ఏప్రిల్ 6
చెన్నైతో ఏప్రిల్ 11, మే 7
పంజాబ్‌తో ఏప్రిల్ 15, ఏప్రిల్ 26
గుజరాత్‌తో ఏప్రిల్ 21
దిల్లీతో ఏప్రిల్ 29

**పంజాబ్ కింగ్స్ మ్యాచ్‌లు**

గుజరాత్‌తో మార్చి 25
లఖ్‌నవూతో ఏప్రిల్ 1, మే 4
రాజస్థాన్‌తో ఏప్రిల్ 5, మే 16
చెన్నైతో ఏప్రిల్ 8, ఏప్రిల్ 30
హైదరాబాద్‌తో ఏప్రిల్ 12
కోల్‌కతాతో ఏప్రిల్ 15, ఏప్రిల్ 26
బెంగళూరుతో ఏప్రిల్ 18, ఏప్రిల్ 20
దిల్లీతో మే 8
ముంబయితో మే 11

**దిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్‌లు**

లఖ్‌నవూతో మార్చి 24, ఏప్రిల్ 22
హైదరాబాద్‌తో మార్చి 30, మే 5
చెన్నైతో ఏప్రిల్ 4
బెంగళూరుతో ఏప్రిల్ 10, ఏప్రిల్ 27
ముంబయితో ఏప్రిల్ 13, మే 15
రాజస్థాన్‌తో ఏప్రిల్ 16
గుజరాత్‌తో ఏప్రిల్ 19, మే 11
కోల్‌కతాతో ఏప్రిల్ 29
పంజాబ్‌తో మే 8

**రాజస్థాన్ రాయల్స్ మ్యాచ్‌లు**

హైదరాబాద్‌తో మార్చి 23
కోల్‌కతాతో మార్చి 26, మే 4
చెన్నైతో మార్చి 30, మే 12
పంజాబ్‌తో ఏప్రిల్ 5, మే 16
గుజరాత్‌తో ఏప్రిల్ 9, ఏప్రిల్ 28
బెంగళూరుతో ఏప్రిల్ 13, ఏప్రిల్ 24
దిల్లీతో ఏప్రిల్ 16
లఖ్‌నవూతో ఏప్రిల్ 19
ముంబయితో మే 1

**లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ మ్యాచ్‌లు**

దిల్లీతో మార్చి 24, ఏప్రిల్ 22
హైదరాబాద్‌తో మార్చి 27, మే 18
పంజాబ్‌తో ఏప్రిల్ 1, మే 4
ముంబయితో ఏప్రిల్ 4, ఏప్రిల్ 27
కోల్‌కతాతో ఏప్రిల్ 6
గుజరాత్‌తో ఏప్రిల్ 12, మే 14
చెన్నైతో ఏప్రిల్ 14
రాజస్థాన్‌తో ఏప్రిల్ 19
బెంగళూరుతో మే 9

**గుజరాత్ టైటాన్స్ మ్యాచ్‌లు**

పంజాబ్‌తో మార్చి 25
ముంబయితో మార్చి 29, మే 6
బెంగళూరుతో ఏప్రిల్ 2
హైదరాబాద్‌తో ఏప్రిల్ 6, మే 2
రాజస్థాన్‌తో ఏప్రిల్ 9, ఏప్రిల్ 28
లఖ్‌నవూతో ఏప్రిల్ 12, మే 14
దిల్లీతో ఏప్రిల్ 19, మే 11
కోల్‌కతాతో ఏప్రిల్ 21
చెన్నైతో మే 18



## రష్మిక వ్యాఖ్యలపై కన్నడనాట విమర్శలు

కథల విషయంలో ఆచితూచి అడుగులేసే కథానాయిక రష్మిక.. ఇటీవలే 'ఛావా' సినిమాతో సినీప్రియుల్ని పలకరించింది. ప్రస్తుతం ఈ చిత్ర విజయంతో జోరుమీదున్న ఆమె.. పలు కార్యక్రమాల్లో, ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ ముచ్చటిస్తుంది. ఈ నేపథ్యంలోనే ఓ ఇంటర్వ్యూలో రష్మిక చేసిన వ్యాఖ్యలపై పలువురు విమర్శల వర్షం కురిపిస్తున్నారు. ఇటీవలే ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో "నేను హైదరాబాద్ నుంచి వచ్చాను. ఇక్కడి ప్రేక్షకులు నాపై చూపిస్తోన్న ప్రేమాభిమానాలు చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది'' అని ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యాఖ్యల్ని పలువురు కన్నడ వాసులు తప్పుపడుతూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "విరాజ్‌పేట్ హైదరాబాద్‌కు ఎప్పుడూ వచ్చింది. ఈ విషయం మాకు తెలియలేదు', 'వేరే ప్రాంతాలకు వెళ్లినప్పుడు సొంతూరు గురించి చెప్పుకోవడానికి సమస్య ఏంటి?'' అంటూ నెట్టింట్లో పోస్టులు పెడుతూ మండిపడుతున్నారు.



## పవన్‌కల్యాణ్‌ను కలిసిన రాజేంద్రప్రసాద్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ప్రముఖ నటుడు రాజేంద్ర ప్రసాద్ కలిశారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం మర్యాదపూర్వకంగా పవన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు పలు విషయాలు చర్చించుకొన్నారు. మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం పవన్‌కల్యాణ్‌ను ఆయన సన్మానించారు. రాజేంద్ర ప్రసాద్‌ను పవన్ ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అయ్యాయి.

## ఈ జింకే నా పిల్ల

"ఈ జింకే నా పిల్ల.. ఆమె కోసం పాటలు పాడనిదే నాకు నిద్రపట్టదు'' అంటూ తన ప్రేయసిని ప్రేక్షకులకు పరిచయం చేస్తున్నాడు ఓ ప్రేమికుడు. 'కళ్లు గుడ్డివి కావు.. కానీ మనసు గుడ్డిదే' అని కవితలు కూడా చెప్తున్నాడు. మరి ఇంతకీ ఈ కవితలకు తన ప్రియురాలి సమాధానమేంటో తెలుసుకోవాలంటే 'వా వాతియారే' సినిమా చూడాల్సిందే. తమిళ కథానాయకుడు కార్తి ప్రధాన పాత్రలో నలన్ కుమారసామి తెరకెక్కిస్తున్న చిత్రం 'వా వాతియారే'. కృతి శెట్టి కథానాయిక. తాజాగా ఈ సినిమాలోని 'ఉయిర్ పతికామా' అంటూ సాగే మొదటి గీతాన్ని విడుదల చేసింది చిత్రబృందం. ఇందులో కార్తి, కృతిల స్టెప్పులు, వారి కెమిస్ట్రీ సినీప్రియులను అలరిస్తోంది. సంతోశ్ నారాయణన్ స్వరపరిచారు.





## పెళ్లిరోజు రాత్రే పరుగులు

చిన్న చిన్న విషయాలకే భయపడుతూ కట్టుబాట్లు, నియమాల మధ్య బతికే ఓ అబ్బాయి...ఆధునిక భావాలున్న అమ్మాయి ఒకరి వ్యక్తిత్వాలను ఒకరు దాచేసి పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకుంటే ఎలా ఉంటుంది? ఆ జంట పెళ్లి రోజు రాత్రే ఊహించని చిక్కుల్లో ఇరుక్కుంటే వాళ్ల పరిస్థితి ఏంటి? దాన్నుంచి తప్పించుకునే క్రమంలో ఒకరి గురించి ఒకరికి అసలు నిజాలు తెలిసిపోతే ఏమైంది? ఇలాంటి ఆసక్తికర ప్రశ్నలకు సమాధానం కావాలంటే 'ధూమ్ ధామ్' సినిమా చూడాల్సిందే. ప్రముఖ బాలీవుడ్ కథానాయిక యామీ గౌతమ్, యువ నటుడు ప్రతీక్ గాంధీ ప్రధాన పాత్రలో రొమాంటిక్ కామెడీ కథతో రిషబ్ సేథ్ రూపొందించారు. ఆదిత్యధర్ నిర్మించారు. శుక్రవారం నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదలైన ఈ సినిమా ప్రస్తుతం టాప్ ట్రెండింగ్ ఓటీటీ సినిమాల్లో ఒకటిగా నిలిచింది. యామీ పోషించిన కోయల్ పాత్ర ద్వారా ఆధునిక అమ్మాయిలు ఎలా ఉండాలనుకుంటున్నారు? వాళ్ల ఆలోచన తీరు ఎలా ఉంది? ఇలాంటి విషయాలను చర్చిస్తూనే నవ్వించే ప్రయత్నం చేశారు దర్శకుడు. అక్కడక్కడా పరుషమైన భాష ఉన్నా రెగ్యులర్‌గా ఓటీటీ సినిమాలు చూసే వారికి అదేం పెద్ద విషయంగా అనిపించకపోవచ్చు. ఆదివారం రోజున సరదాగా ఓ సినిమా చూడాలకునే యువతరం ప్రేక్షకుల కోసం హిందీతో పాటు తెలుగు, తమిళ, ఇంగ్లిష్ భాషల్లో ఈ సినిమా అందుబాటులో ఉంది.



# భాగ్యనగరిలో చిరు పరిచయ గీతం

కథానాయకుడు చిరంజీవి.. దర్శకుడు వశిష్ఠ కలయికలో రూపొందుతున్న సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర'. యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలు. కునాల్ కపూర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ముగింపు దశలో ఉన్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. దీనిలో భాగంగా ఏఎస్ ప్రకాశ్ రూపొందించిన భారీ సెట్‌లో చిరంజీవి పరిచయ గీతాన్ని చిత్రీకరిస్తున్నారు. ఈ విషయాన్ని చిత్ర బృందం శనివారం అధికారికంగా ప్రకటిస్తూ.. ఓ కొత్త లుక్‌ను పంచుకుంది. అందులో చిరు స్టైలిష్ లుక్‌లో కారు దిగుతూ కనిపించారు. ఈ పాటలో చిరు మేనల్లుడు, హీరో సాయిదుర్గా తేజ్ అతిథి పాత్రలో తళుక్కున మెరవనున్నారని సమాచారం. ఇప్పటికే ఆయన ఈ చిత్రీకరణలోకి అడుగు పెట్టినట్లు తెలిసింది. అలాగే నిహారిక కొణిదెల కూడా అతిథి పాత్రలో సందడి చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ పరిచయ గీతానికి కీరవాణి స్వరాలు సమకూర్చగా.. రామజోగయ్య శాస్త్రి సాహిత్యమందించారు. శోభి మాస్టర్ నృత్యరీతులు అందిస్తున్నారు. ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడి ఉన్న సోషియో ఫాంటసీ కథతో ఈ చిత్రం రూపొందుతోంది. దీనికోసం చిత్రబృందం ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టించింది. యాక్షన్, విజువల్ ఎఫెక్ట్స్ కొత్త అనుభూతిని అందిస్తాయని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఈ సినిమాకి ఛాయాగ్రాహకుడు: ఛోటా కె.నాయుడు.




## తొలి హిందీ సినిమా ఖరారు

గతేడాది 'కిస్సిక్..' అంటూ కుర్రకారుని ఉర్రూతలూగించిన శ్రీలీల.. బాలీవుడ్‌లోకి అడుగు పెట్టబోతుందా? ఏ హీరో సరసన నటించనుంది? ఎలాంటి కథతో రాబోతుంది? ఇప్పుడీ ప్రశ్నలన్నింటికీ చెక్‌పెట్టేసింది చిత్రబృందం. ఆమె, కార్తిక్ ఆర్యన్ జంటగా ఓ చిత్రంలో నటిస్తున్నారు. అనురాగ్ బసు దీన్ని తెరకెక్కిస్తున్నారు. శనివారం ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ.. సామాజిక మాధ్యమాల వేదికగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. "నువ్వు నా దానివి.. నువ్వే నా ప్రతి ఆనందానివి'' అంటూ సాగుతున్న ఈ టీజర్‌లో కార్తిక్ గాయకుడిగా, ఆయన ప్రేయసిగా శ్రీలీల కనిపిస్తూ సినిమాపై అంచనాలను పెంచుతుంది.

## 'డాకు మహారాజ్' ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్

బాలకృష్ణ హీరోగా బాబీ దర్శకత్వం వహించిన చిత్రం 'డాకు మహారాజ్'. ప్రజ్ఞా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్, ఊర్వశీ రౌతేలా, బాబీ దేవోల్ కీలక పాత్రలు పోషించారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయాన్ని అందుకుంది. దీని ఓటీటీ విడుదల కోసం సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే 'నెట్‌ఫ్లిక్స్' తాజాగా 'డాకు మహారాజ్' స్ట్రీమింగ్ డేట్‌ను ప్రకటించింది. ఫిబ్రవరి 21 నుంచి తమ ప్లాట్‌ఫామ్‌లో వీక్షించవచ్చని తెలిపింది. కథేంటంటే: చిత్తూరు జిల్లా మదనపల్లిలో మొదలవుతుంది కథ. అక్కడ కాఫీ ఎస్టేట్‌కి అధిపతి అయిన కృష్ణమూర్తి (సచిన్ ఖేడ్కర్) విద్యాసంస్థల్ని నడుపుతుంటాడు. తన మనవరాలు వైష్ణవి అంటే ప్రాణం. చిన్నప్పుడే తల్లి చనిపోవడంతో ఆ పాపకి అన్నీ తామై కుటుంబమంతా అల్లారు ముద్దుగా పెంచుతుంటుంది. అలాంటి వైష్ణవి ప్రాణాలకి లోకల్ ఎమ్మెల్యే త్రిమూర్తులు (రవికిషన్) నుంచి ముప్పు ఏర్పడుతుంది. దాంతో ఆ ఇంట్లోనే పనిచేస్తున్న తన సైన్యం నుంచి భోపాల్‌లో ఉన్న మహారాజ్ (బాలకృష్ణ)కి వర్తమానం అందుతుంది. వైష్ణవిని కంటికి రెప్పలా కాపాడతానని మాట ఇచ్చిన మహారాజ్ తన పేరుని నానాజీగా మార్చుకుని రంగంలోకి దిగుతాడు. ఇంతకీ ఈ మహారాజ్ ఎవరు? భోపాల్‌లో ఎందుకు ఉండాల్సి వచ్చింది? వైష్ణవికీ, ఆయనకీ సంబంధం ఏమిటి? ఈ కథతో బల్వంత్ ఠాకూర్ (బాబీ దేవోల్), నందిని (శ్రద్ధా శ్రీనాథ్), కావేరి (ప్రజ్ఞా జైస్వాల్)లకు సంబంధం ఏమిటనే విషయాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే!



PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254, MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154